జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



ప్రజాపాలన

నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?

మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది

వివరాలకు సంప్రదించండి 8886022523



సంపుటి 7 సంచిక 130 | హైదరాబాద్, జులై 24 సోమవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00


# కేసీఆర్ చారిత్రక నిర్ణయం

## వీఆర్ఏ వ్యవస్థ శాశ్వతంగా రద్దు



హైదరాబాద్ : నీరటి, మస్కూరు, లష్కర్ వంటి కాలం చెల్లిన పేర్లతో పిలువబడుతూ, భూస్వామ్య వ్యవస్థకు చిహ్నాలుగా మిగిలిన వీఆర్ఏ వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలుగా పనిచేస్తున్న సిబ్బందిని రెవెన్యూ శాఖలో సూపర్ న్యూమరరీ పోస్టుల్లో క్రమబద్ధీకరించనున్నట్లు సీఎం తెలిపారు.మంత్రుల సబ్ కమిటీ సిఫారసుల మేరకు, నిబంధనలను అనుసరించి వీఆర్ఏల అర్హతలను ప్రకారం, మున్సిపాలిటీ, మిషన్ భగీరథ, ఇరిగేషన్ తదితర శాఖల్లో సర్దుబాటు చేస్తూ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మినెంట్ చేస్తున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సోమవారం విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సీఎం ఆదేశించారు.వీఆర్ఏల విద్యార్హతలను బట్టి నాలుగు శాఖల్లో వీఆర్ఏలను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నీటిపారుదల, పురపాలక శాఖ, పంచాయతీరాజ్ శాఖ, మిషన్ భగీరథ శాఖలో వీఆర్ఏలను సర్దుబాటు చేయనున్నారు. 61 ఏండ్లు దాటిన వీఆర్ఏల ఉద్యోగాన్ని వారి వారసులకు ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర రెడ్డి, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, ఏ జీవన్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ముఖ్యమంత్రి సలహాదారు సోమేష్ కుమార్, సీఎస్ శాంతి కుమారి, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ నర్సింగ రావు, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావు, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంఏయూడీ అరవింద్ కుమార్, సీఎం సెక్రటరీ స్మితా సభర్వాల్, దాసోజు శ్రవణ్, వీఆర్ఏ జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

# జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణం



హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ , మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మల్లారెడ్డి, మహమూద్ అలీ, ఎంపీ కే.కేశవరావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ పాల్గొన్నారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పదోన్నతిపై సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ఆయన స్థానంలో జస్టిస్ అరాధేను నియమించారు. తెలంగాణ హైకోర్టు ఏర్పాటు తర్వాత జస్టిస్ అరాధే ఆరో సీజే. సీఎం కేసీఆర్ నూతన సీజేకు పుశ్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# దూకుడు పెంచిన తెలంగాణ కాంగ్రెస్..

## పీఏసీ సమావేశంలో కీలక నిర్ణయాలు. ఈ నెల 30న..



హైదరాబాద్ :టీ కాంగ్రెస్ దూకుడు పెంచింది. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్లాన్ చేస్తోంది. వరుస సమావేశాలతో క్యాడర్‌లో జోష్ పెంచుతోంది. తాజాగా గాంధీభవన్‌లో జరిగిన PAC కీలక భేటీ జరిగింది. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, నేతల మధ్య సమన్వయం, భవిష్యత్ ప్రణాళిక, ప్రియాంక పర్యటన, బస్సుయాత్రలపై చర్చించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతల పీఏసీ సమావేశం ఆదివారం జరిగింది.దాదాపు 3గంటలకుపైగా జరిగిన ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, (మిగతా 2లో..)

## దళిత బంధు, బీసీ బంధు పథకాలతో

# ప్రజలను మోసం చేయొద్దు..

## చాడ వెంకటరెడ్డి



హుస్నాబాద్, జూలై 23 : రాష్ట్రంలో దళిత బంధు, బీసీ బంధు పేరుతో ప్రజలను మోసం చేయొద్దని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజాధనాన్ని వృధా చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని స్థానిక అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు, ధరణి పోర్టల్ లో ఉన్న లోపాలను సవరించాలని లేనిపక్షంలో కలెక్టరేట్ల ముట్టడి చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్వతంత్ర భారతావనిలో రోజురోజుకు మతోన్మాదం పెట్టి పోతుండడంతో మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పక్కనపెట్టి రాజకీయ పార్టీలను చీల్చి అధికార దుర్వినియోవానికి పాల్పడుతుందని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై ఐటీ, ఈడీ దాడులు చేయించడం అప్రజాస్వామికమన్నారు.కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పలు పార్టీలు ఏకమై కూటమిగా ఏర్పడ్డాయని తెలిపారు. బీజేపీ సర్కార్ కు వ్యతిరేకంగా ఏర్పడిన కూటమిని తట్టుకోలేక, ప్రత్యామ్నాయంగా మోడీ సర్కార్ మరోకూటమిని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) బరిలో నిలుస్తుందని వెల్లడించారు.నరేంద్ర మోడీ మౌనం వీడి మణిపూర్ లోని మహిళలపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా మహిళలపై నిత్యం ఏదోచోట దాడులు జరుగుతున్న వాటిని నియంత్రించలేకపోవడం సిగ్గుచేటన్నారు. దేశవ్యాప్తంగా కులమతాలకు అతీతంగా రాజకీయ పార్టీలు పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం విరాజిల్లుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపె మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎడల వనేష్, జాగిరి సత్యనారాయణ పాల్గొన్నారు.



## ట్విటర్ లోగో నుండి మాయం కానున్న ‘ పక్షి ‘

వాషింగ్టన్ : ఎలన్ మస్క్ మరో బాంబు పేల్చారు. గతేడాది ట్విటర్‌ను కొనుగోలు చేసినప్పటి నుండి మస్క్ భారీ మార్పులు చేస్తున్నారు. తాజాగా ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విటర్ లోగో నుండి పక్షి మాయం కానున్నట్లు తెలిపారు. లోగో మార్పు విషయాన్ని ఆయన ఆదివారం ట్వటర్‌లో వెల్లడించారు. “త్వరలోనే మేం ట్విటర్ బ్రాండ్‌కు.. ఆ తర్వాత క్రమంగా అన్ని పక్షులకు వీడ్కోలు పలకనున్నాం. ఈ రాత్రి పోస్టు చేసిన X లోగో బాగుంటే.. రేపటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా లైవ్‌లోకి వస్తుంది” అని ట్వీట్ చేశారు. మస్క్ ట్విటర్‌ను గతేడాది కొనుగోలు చేసిన నాటి నుంచి ఇదే అతిపెద్ద మార్పుగా నిలవనుంది. ట్విటర్‌ను సరికొత్తగా ఏర్పాటు చేసిన ‘ఎక్స్ కార్ప్’ అనే కంపెనీలో విలీనం చేస్తున్నట్లు గతేడాది అక్టోబర్ లో మస్క్ ప్రకటించిన సంగతి తెలిసిందే. (మిగతా 2లో..)

# మైనార్టీలకూ లక్ష సాయం..

## కొత్త పథకాన్ని ప్రకటించిన సీఎం కేసీఆర్



హైదరాబాద్, : మైనార్టీలకు సీఎం కేసీఆర్ తీపి కబురునందించారు. మైనార్టీల ఆర్థిక స్వావలంబన దిశగా మరో కీలక నిర్ణయాన్ని తెలంగాణ సర్కార్ ప్రకటించింది. ఇప్పటికే రాష్ట్రంలో బీసీలకు అందిస్తున్న తరహాలోనే మైనార్టీలకూ పూర్తి రాయితీతో రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించాలని నిర్ణయించారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. సమాజంలో కులమతాలకు అతీతంగా పేదరికాన్ని ప్రారదోలాలనే దార్శనికతతో ప్రభుత్వం పని చేస్తోందని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఇందులో భాగంగా ఇప్పటికే అన్ని వర్గాల పేదలకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందన్నారు. మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. విద్యా, ఉపాధి సహా అన్ని రంగాలలో పలు సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలలోని పేదరికం, వెనుకబాటుతనం తొలగించేందుకు కృషి చేస్తోందని, ఈ కృషిని మరింత ముందుకు తీసుకువెళతామని పేర్కొన్నారు. ఈ దిశగా ప్రభుత్వం చేపట్టిన సమర్ధవంతమైన కార్యాచరణ ఉత్తమ ఫలితాలనిస్తోందన్నారు.భిన్న సంస్కృతులు, విభిన్న మత ఆచార సాంప్రదాయాలను సమానంగా ఆదరిస్తూ రాష్ట్రంలో గంగా జమున తహజీబ్‌ను కాపాడే ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని పేర్కొన్నారు. మైనార్టీలకు రూ. లక్ష ఆర్థిక సాయం పూర్తి సబ్సిడీతో అందించాలి. కులమతాలకు అతీతంగా పేదల అభివృద్ధికి ప్రభుత్వం పనిచేస్తోంది. మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నది. భిన్న సంస్కృతులు, మతాచారాలను ప్రభుత్వం సమానంగా ఆదరిస్తోంది. రాష్ట్రంలో గంగా జమున తహజీబ్‌ను కాపాడే ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది అని స్పష్టం చేశారు.

ఆర్థిక సాయానికి అర్హతలివే

సామాజిక, మానవీయ కోణంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు రికార్డులు సృష్టిస్తున్నాయి. తాజాగా బీసీలకు రూ. లక్ష ఆర్థిక సాయం తరహాలోనే ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలకు రూ. లక్ష ఆర్థిక సాయం దిశగా సర్కార్ పూర్తి రాయితీతో కూడిన పథకాన్ని ప్రకటించింది. వారసత్వ వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వృత్తులకు సర్కార్ ఈ సాయం అందిస్తోంది. ఈ పథకం కింద ప్రయోజనం పొందేందుకు 2023 జూన్ 2 నాటికి దరఖాస్తుదారు తప్పనిసరిగా 21నుంచి 55 ఏళ్ల మధ్య వయసు కల్గి ఉండాలని నిబంధన విధించింది.ఒక్కో కుటుంబానికి ఒక యూనిట్‌గా పరిగణించి ఒక గ్రాంట్ మాత్రమే అందజేస్తారు. (మిగతా 2లో..)




# మైనార్టీలకూ లక్ష సాయం..

(మొదటి పేజీ తరువాయి)

లబ్దిదారుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.5లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల కంటే ఎక్కువ ఉండరాదు. అంతకుముందు ఏదైనా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాన్ని వినియోగించుకున్నట్లయితే ఆయా లబ్దిదారులు ఈ కొత్త పథకానికి అనర్హులుగా పేర్కొంది. తెలంగాణలోని వెనుకబడిన తరగతుల కళాకారులు, వృత్తిపరమైన సంఘాలు మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. ముస్లిం లబ్దిదారులకు స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా, క్రిస్టియన్లకు క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం అందజేత. జిల్లా స్థాయి మానిటరింగ్, స్క్రీనింగ్ కమిటీల నేతృత్వంలో దరఖాస్తుల పరిశీలన, వడపోత, లబ్దిదారుల ఎంపిక జరుగుతుంది. జిల్లా కలెక్టర్ల ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. జిల్లా ఇంచార్జి మంత్రి నేతృత్వంలో లబ్దిదారుల ప్రకటన. లబ్దిదారుల సెలక్షన్ జాబితా టీఎస్ఎంఎఫ్‌సి వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. దశల వారీగా పథకం అమలవుతుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో వెల్లడించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## ట్విటర్ లోగో నుండి మాయం కానున్న 'పక్షి'

(మొదటి పేజీ తరువాయి)

మస్క్‌కు ఎక్స్ అనే అక్షరం అంటే విపరీతమైన ఇష్టం. ఈ విషయం కొత్తగా తెలిసిందేమీ కాదు. ట్విటర్ సీఈవోగా లిండా యాకరినో బాధ్యతలు చేపట్టిన సమయంలో కూడా కంపెనీని ఎవ్రీ థింగ్ యాప్ ఎక్స్‌గా మార్చడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తుందని మస్క్ ట్వీట్ చేశారు. ఇక ట్విటర్‌లోని అన్ వెరిఫైడ్ ఖాతాల నుంచి ప్రత్యక్ష సందేశాలు ఉంచడాన్ని పరిమితం చేస్తున్నట్లు శనివారం మస్క్ ప్రకటించారు. "డైరెక్ట్ మెసేజ్‌ల స్పామ్‌ను తగ్గించేందుకు మేం ప్రయత్నాలు చేస్తున్నాం. అన్‌వెరిఫైడ్ ఖాతాల నుండి భవిష్యత్తులో పరిమిత సంఖ్యలోనే డీఎం (డైరెక్ట్ మెసేజ్)లు చేయగలరు. నేడే సబ్‌స్క్రైబ్ చేసుకొని ఎక్కువ మెసేజ్‌లు పంపండి" అని ట్విటర్ పేర్కొంది. ఈ ఏప్రిల్‌లో పక్షి లోగో స్థానంలో డాగ్ కాయిన్‌ను పోస్ట్ చేశారు. ఈ మార్పుతో మార్కెట్ విలువకు 4 బిలియన్ డాలర్ల ఆదాయం తెచ్చేందుకు సహాయపడింది. అయితే రెండు రోజులకు తిరిగి పక్షిలోగోను మారుస్తున్నట్లు ప్రకటించారు.

# దూకుడు పెంచిన తెలంగాణ కాంగ్రెస్..

(మొదటి పేజీ తరువాయి)

కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, పీఏసీ కన్వీనర్ షబ్బీర్ అలీ పాల్గొన్నారు. నెల 30న కొల్లాపూర్‌లో ప్రియాంకగాంధీ సభ, బస్సుయాత్రపై చర్చించినట్లు పార్టీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలుంటాయన్నారు. దాంతోపాటు ఆగస్టు 15న ఎస్టీ, ఎస్టీ, మైనార్టీ గర్జన సభ మల్లిఖార్జున ఖర్గే అధ్యక్షత జరుగుతుందన్నారు. ఓబీసీ డిక్లరేషన్, ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్, ముస్లిం అండ్ మైనార్టీ, మహిళల డిక్లరేషన్‌పై పీఏసీలో చర్చ జరిగిందన్నారు షబ్బీర్ అలీ. దాంతోపాటు బస్సుయాత్ర రూట్ మ్యాప్‌పై కూడా చర్చించామన్నారు. మరోవైపు టీ కాంగ్రెస్‌లో ఎన్నికల కమిటీ జాబితా అగ్గి రాజేసింది. ఎన్నికల కమిటీలో చోటు దక్కకపోవడంతో పార్టీ సీనియర్ నేత పొన్నం ప్రభాకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాదు ఆయన అనుచరులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు చేరుకొని నిరసన తెలిపారు. పొన్నం ప్రభాకర్‌కి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ధర్మపురి బిఆర్ఎస్ అనుబంధ సంఘలతో విస్తృత స్థాయి సమావేశం



ధర్మపురి, జూలై23(జన తెలంగాణ): ప్రతి కార్యకర్త బాధ్యత యుతంగా పని చేయాలి మంత్రి కొప్పు పార్టీ కార్యోణ్ముఖులు కావాలి ప్రతి కార్యకర్తకు అండగా బిఆర్ఎస్ పార్టీ - మంత్రి కొప్పు పార్టీ శ్రేణులు బాధ్యత విధంగా పని చేయాలని, పార్టీ కి పట్టుకొమ్మలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు.

## DJF జర్నలిస్ట్ గర్జన వాల్ పోస్టర్ ఆవిష్కరించిన డా.రాజా రమేష్



జన తెలంగాణా (ప్రతినిధి )జులై 23.తేదీ 25-07-2023 నా గోదావరిఖని లో జరగబోయే జర్నలిస్ట్ గర్జన పోస్టర్ ఈరోజు చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్ధి లిడా రాజా రమేష్ బాబులి గారు ఈరోజు వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్ట్ లు వివక్షత కు గురవుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్ట్ ల పాత్ర క్రియాశీలకంగా పని చేసిన విషయం కెసిఆర్ తెలంగాణ ప్రభుత్వం మర్చిపోయింది అని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం లో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని జర్నలిస్ట్ లకు కాంగ్రెస్ తోనే న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

# ఘనంగా ఊర పండుగ.....



నిర్మల్ జిల్లా జూలై 22 ప్రజాపాలన ప్రతినిధి:నిర్మల్ జిల్లా ముధోల్ మండలం ఆష్ట గ్రామంలో ఈరోజు ఊరా పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు మంగళహారతులు భాజ భాజంత్రీలతో అంగరంగ వైభవంగా పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు పెద్ద ఎత్తున పాల్గొని నృత్యాలు చేస్తూ ఊరేగింపు చేపట్టారు. అనంతరం మహాలక్ష్మి పోచమ్మ దేవాలయంలో మారెమ్మ గ్రామ దేవతల ఆలయాలు చుట్టూ అంగరంగ వైభవంగా బోనాలతో ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పండుగ సందర్భంగా గ్రామ సర్పంచ్ గ్రామ పెద్దలు యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ అమ్మవారి దయ గ్రామం పై ఎల్లప్పుడూ ఉండాలని గ్రామ0 అభివృద్ధి వైపు ప్రయాణం చేయాలని కోరుకున్నట్లు తెలియజేశారు.

# పుట్టినరోజు గిఫ్టు- బడి ఇచ్చే చెట్టు



దస్తురాబాద్, జూలై 23 ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాల గొడిసిర్యాల్ లో ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా ప్రారంభించిన కార్యక్రమం పుట్టినరోజు గిఫ్టు-బడి ఇచ్చే చెట్టు ప్రతి విద్యార్థి పుట్టినరోజు సందర్భంగా పాఠశాల నుండి ఒక మొక్కను గిఫ్టుగా అందజేయడం జరుగుతుంది. దానిని జాగ్రత్తగా పెంచాలని, ఒక చెట్టు నిస్వార్థంగా పది మందికి ఎలా ఉపయోగపడుతుందో ప్రతి విద్యార్థి ఆ విధంగా ఎదగాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేసారు. తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశంలో ఈ కార్యక్రమం గురించి వివరిస్తూ చెట్ల యొక్క ఉపయోగాలు, చెట్లను పెంచడం గురించి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం కోసం జామ, ఉసిరి,బాదం,సీతాఫలం,సపోటా వంటి వివిధ రకాల సుమారు 200 మొక్కలను పాఠశాలలో అందుబాటులో ఉంచినట్టు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమం చెప్పటినందుకు గ్రామ సర్పంచ్,ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, తల్లిదండ్రులు పలువురు గ్రామస్తులు ఉపాధ్యాయులను అభినందించారు.

# కొట్టుకుపోయిన పత్తి ,సోయా పంటలు....



నిర్మల్ జిల్లా జూలై 22 ప్రజాపాలన ప్రతినిధి: నిర్మల్ జిల్లాలోని గత నాలుగు రోజులుగా కురుస్తున్నటువంటి భారీ వర్షాలకు వాగులు వంకలు జలకలతో పొంగిపొర్లుతున్నాయి. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా లోని భారీ వర్షాలకు చాలా మండలాల్లో పత్తి సోయా వంటి పంటలు పూర్తిగా నాశనం అయ్యాయి భారీ వర్షాలకు వరద నీరు కొట్టుకు రావడంతో మొలకెత్తినటువంటి పత్తి సోయా పంటలు చాలావరకు నష్టపోయాయి దీంతో రైతులకు తీవ్ర నిరాశనిస్పృహలకు లోనవుతున్నారు. రైతులకు అకాల నష్టం మిగిల్చాయి వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. చాలా ప్రాంతాల్లో అకాల వర్షాలకు వరి నాటు వేసిన తర్వాత కూడా పంట కొట్టుకుపోవడం తో రైతుల్లో తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక దీనస్థితిలో రైతులు ఉన్నారు. పెట్టిన పంటకు గిట్టుబాటు ధర రాక బాధపడుతున్నటువంటి రైతులకు వర్షం రూపంలో మరో నష్టం మిగిల్చిందని చెప్పవచ్చు ...పంట కోసం తీసుకొచ్చినటువంటి అప్పులు ఒకవైపు వర్షం మిగిల్చిన నష్టం మరోవైపు. ఉండటంతో ఎటు పాలు పోనీ పరిస్థితిగా ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో తమా బాధని ప్రభుత్వము అర్థం చేసుకొని నష్టపోయిన పంటకు ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించాలని పలు రైతులు కోరుతున్నారు.

# లక్ష్యం..... చెత్తకుప్పల్లో



నిర్మల్ జిల్లా జూలై 22 ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి వైకుంఠధామాలుసిగ్రీ గ్రెషన్ షెడ్యూలు. కొన్ని గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో లక్షల నిధులు వెచ్చించి నిర్మించినటువంటి షెడ్ల వైకుంఠధామాలు పిచ్చి మొక్కలతో చెత్తాచెదరంతో నిండి ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో చెత్త సేకరణ సరిగ్గా లేక ఆకతాయిలకు అడ్డగా మారాయి .కొన్నిచోట్ల తడి చెత్త పొడి చెత్త వేరు చేయకుండా చెత్త సేకరించి గ్రామ సమీపంలో తగలబెట్టడం దాంతో దుర్భరమైన వాసన రావడంతో ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలు అవుతున్నారు. ఈ విషయంలో గ్రామా సర్పంచ్లకు తెలియజేసినప్పటికీ చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతూనే ఉన్నారు గ్రామంలో చెత్త సేకరించి తడి పొడి చెత్తను వేరు చేయాల్సి ఉండగా అది ఎక్కడ కూడా జరగకపోవడం విడ్డూరంగా ఉంది కొన్ని చోట్ల నాణ్యత లేక కుళ్ళిపోయి అపరిశుభ్రంగా నీటిలో మునుగుతూ దుర్భరమైనటువంటి వాసనను వెదజల్లుతున్నాయి దీంతో అటుగా వెళ్లే ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంది ఇప్పటికైనా గ్రామస్థాయిలో ఉండే సర్పంచులు సెక్రెటరీ చొరవ చూపి ఇలాంటివి జరగకుండా తగు చర్యలు తీసుకోవాలి . ఇలాంటి చర్యల వల్ల ప్రగతి కుంటిపడుతుందిగ్రామ స్థాయిలో ఎన్ని ప్రగతి పథకాలు పనులు తీసుకువచ్చినప్పటికీ కూడా ఇలాంటి పనుల వల్ల ప్రభుత్వానికి అటు అధికారులకు మాయని మచ్చగా తయారవుతున్నాయి. ఇప్పటికైనా చర్యలు తీసుకొని వైకుంఠధామల యందు పిచ్చి మొక్కలు తీసివేసి తగు చర్యలు తీసుకోవాలి. కొన్ని గ్రామపంచాయతీలో సేగ్రి గేషన్ షెడ్ల లో పలు చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

## ఏఐసీసీ ఇంచార్జ్ మాణిక్ రావుకు శాలువాతో సత్కారం



ప్రజాపాలన ప్రతినిధి: జులై 23. స్థానిక మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రామిల రాధిక ఆదివారం రోజున హైదరాబాద్ గాంధీ భవన్లో Aicc ఇంచర్జ్ శ్రీ మాణిక్ రావు ఠాకరే గారిని శాలువాతో సత్కరించి గాంధి భవన్లోకి ఆ హ్వానించిన మహిళా చెన్నూర్ నియోజకవర్గం ఆడబిడ్డ.



## కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు వేడుకలు



ప్రజాపాలన ప్రతినిధి: జులై 23. స్థానిక మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో తేది:- 24-07-2023 రోజునలితెలంగాణ రాష్ట్ర ఐటీ మరియు పురపాలక శాఖ మంత్రివర్యులు గౌరవ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు గారి పుట్టినరోజు సందర్భంగా చెన్నూర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ శ్రీ బాల్క సుమన్ అన్నలి గారి ఆదేశాల మేరకు.....చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం యందు లిరక్తదానం శిబిరంలి సమయం :-10:30 గంటలకు.లి ఏర్పాటు చేయడం జరుగుతుంది. కావున పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు,సోషల్ మీడియా వారియర్స్, యూత్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ??రక్తాదాన కార్యక్రమన్ని విజయవంతం చేయగలరని మనవి.

## ఉప్పొంగిన నది.... నిలిచిపోయిన రాకపోకలు



సిర్పూర్ టి 23 జూలై ప్రజాపాలన ప్రతినిధి: సిర్పూర్(టి) మండలం వెంకట్రావు పేట్ సమీపంలో తెలంగాణ సరిహద్దులోని తెలంగాణ-మహారాష్ట్ర అంతరాష్ట్ర పొడుషా బ్రిడ్జ్ మూసివేయబడింది, దీనితో రాకపోకలు అగిపోయినాయి, వార్ధా నది (పెనుగంగా) ఉదృతంగా బ్రిడ్జ్ పై నుండి ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో దారి మూసివేయబడింది. అటు హుడికిలి సమీపంలో ప్రధాన రోడ్డు పైకి బ్యాక్ వాటర్ రావడంతో సిర్పూర్ (టి) నుండి జక్కాపూర్ మీదగా మహారాష్ట్ర వెళ్ళే మార్గం కూడ తాత్కాలికంగా మూసివేయబడింది. ఈ రెండు మార్గాలలో ఎలాంటి ప్రయాణాలు కొనసాగించ వద్దు, సమీపంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. చేపల వేటకు వెళ్ళరాదు. వరద ఉధృతి క్రమంగా పెరుగుతున్నందున ఈ మార్గాలలో వెళ్ళే వాహనదారులు, ప్రయాణికులకు ఇతర మార్గాల ద్వారా వెళ్ళాలి అని సిర్పూర్ టీ ఎస్ ఐ ధికొండ రమేష్ తెలిపారు .

### మణిపూర్ అల్లర్లకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి



ఆసిఫాబాద్ జిల్లా జూలై 23 (ప్రజాపాలన, ప్రతినిధి) : మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు, ముక దాడులు, మహిళలపై జరుగుతున్న అరాచకాలపై ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ లో ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు, టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సోయం ఇందూ రావు, జాదవ్ కిరణ్, టీఎస్ టిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ టి యు జిల్లా అధ్యక్షుడు సంజయ్ కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్,మండల విద్యాధికారి మను కుమార్,లు మాట్లాడుతూ గత రెండు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మహిళలపై అత్యాచారం, వారిని వివస్త్రలను చేసి, బహిరంగంగా ఊరేగించడం, అక్కడి ఆదివాసి తెగలపై ముఖ దాడులు ఆందోళనలు, అశాంతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆందోళన జరుగుతున్న అక్కడి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మౌనంగా ఉండటాన్ని ఖండిస్తున్నామని అన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ సామూహిక అత్యాచారానికి బాల్పడుతూ మాలతావని సిగ్గుతో తలదించుకునే విధంగా ఏందిరా ప్రభుత్వం ఆ రాష్ట్రములో శాంతిని నెలకొల్పడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మహిళను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారాలకు పాల్పడిన గుండాలను కఠినంగా శిక్షించాలని, బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హేమంత్ షిండే, రమేష్, ఉసన్న, నాగోరావు, కార్తీక్, రాజేందర్, టీకానాద్, తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ మండల ఉపాధ్యక్షుడిగా జిడి వెంకటేష్ నియామకం



శంకరపట్నం జూలై 23 ప్రజాపాలన రిపోర్టర్:శంకరపట్నం మండలం కేశవపట్నంకి చెందిన జీడి వెంకటేష్ ను బిఎస్పి పార్టీ శంకరపట్నం మండల ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్ తెలియజేశారు. శంకరపట్నం మండలంలో బి ఎస్ పి పార్టీ బలోపేతానికి వెంకటేష్ ఎంతగానో కృషి చేశారని అతని సేవను గుర్తించి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం వెంకటేష్ ను ఉపాధ్యక్షుడుగా నియమించినట్లు తెలియజేశారు.

## కొవ్వలి ఆధ్వర్యంలో ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం



నరసాపురం, జూలై 23 (ప్రజాపాలన ప్రతినిధి) : కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక 7 వ వార్డులోని ఆయన నివాసం వద్ద ఈనెల 25వ తేదీ శనివారం ఉచిత ఆక్యు పంక్చర్ వైద్య శిబిరం నిర్వహించనున్నామని నరసాపురం పరిసర ప్రాంతాల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కొవ్వలి రామ్మోహన్ నాయుడు కోరారు. తమ నివాసం వద్ద ప్రతినెల మొదటి శనివారం ఉచిత ఆక్యుపంచర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని దీనిలో భాగంగా వచ్చే నెల ఆగస్టు 5వ తేదీ మొదటి శనివారం నిర్వహించవలసిన ఈ వైద్య శిబిరాన్ని కొన్ని అనివార్య కారణాల కారణంగా ఈనెల 25 వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నామని తేదీ మార్పును ప్రజలు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తల, మెడ, మడమ, మోకాళ్ళు తదితర దీర్ఘకాలిక నొప్పులు, వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రముఖ ఆక్యుపంక్చర్ వైద్యులు, కొవ్వలి ఫౌండేషన్ నిర్వాహకులు కొండా శ్రీధర్ ఆక్యుపంక్చర్ వైద్యం ద్వారా ఉపశమనం కల్పిస్తున్నారు. నరసాపురం పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొవ్వలి రామ్మోహన్ నాయుడు కోరారు. మరిన్ని వివరాలకు తమ ఫోన్ నెంబర్ 9849304430 ను సంప్రదించాలని రామ్మోహన్ నాయుడు సూచించారు.

## 25న విద్యాసంస్థల బందును విజయవంతం చేయండి: ఎస్ఎఫ్ఐ



కర్నూల్ ప్రజాపాలన ప్రతినిధి :విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈనెల 25న రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నటువంటి విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వీరన్న తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఉచితంగా వెంటనే అందివ్వాలని గుంటూరులోని తాడేపల్లి లో ఉన్నటువంటి ఇంటర్ విద్యామండలి కార్యాలయాన్ని ముట్టడించామని తెలిపారు. విద్యార్థి సమస్యల కోసం పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం తగదని అన్నారు. ఈ అరెస్టుల కారణంగా ఉద్యమాలను ఆపలేరని అన్నారు. కళాశాలలు తెరిచి దాదాపు రెండు నెలలు కావస్తున్నా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేసిందని, ఈ ప్రభుత్వం నిరాకరిస్తుంది అంటే విద్యార్థులను చదువుకు దూరం చేయడానికి అన్నారు. అంతేకాకుండా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సరైన భోజనం మరియు సరైన మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విద్యార్థి సమస్యల కారణంగా రేపు చేపడుతున్న రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఖాజా, నాయకులు గణేష్, యుగంధర్, సతీష్, మంజునాథ్, అశోక్, మధు, మురళి తదితరులు పాల్గొన్నారు.

# మానసిక సమస్యలకు ఆధునిక చికిత్స

# ' ఇండ్లాస్ ' తో ఆరోగ్యకరమైన సమాజం అవసరం



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : ప్రస్తుత యాంత్రిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ మానసిక సమస్యలతో సతమత మవుతున్నరని, అటువంటివారికి ఇండ్లాస్ చక్కని చికిత్సా కేంద్రంగా ఉపయోగ పడుతుందని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమ చంద్రారెడ్డి అన్నారు. సూర్యారావు పేటలోని దేవి ఆయిల్ మిల్ రోడ్ లో ఇండ్లాస్ చైల్డ్ అండ్ గైడెన్స్ క్లినిక్ ను హేమ చంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు విద్యార్థులు చదువుల కారణంగా కొంతమంది, సామాజికంగా అనేక కారణాల తో పిల్లలు కూడా మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థలలో విద్యార్థులకు చక్కటి ఆరోగ్యం పెంపొందించే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అధ్వర్యంలో పలు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాల్సిన కోరినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మానసికంగా ఆరోగ్యంగా వున్నపుడే హెల్తీ సొసైటీ సాధ్యమవుతుంది అని అన్నారు. ప్రత్యేక అదితిగా పాల్గొన్న ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె. నివాస్ మాట్లాడుతూ నేటి సమాజంలో మానసిక ఆందోళనలతో సతమత మవుతున్నారని అన్నారు. అయితే వారి సమస్యలకు ఎలా చికిత్స పొందాలో తెలియడం లేదన్నారు. అటువంటి వారికి ఇండ్లాస్ క్లినిక్ చక్కని ట్రీట్మెంట్ అందిస్తుంది అన్నారు. డాక్టర్ వై ఎస్ ఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలంలో అనేక పరిస్థితుల కారణంగా పిల్లలలో మానసిక సమస్యలు వస్తున్నాయని అన్నారు. లేట్ మారేజ్, కోవిడ్, ఇతర కారణాలు వల్లచిన్న పిల్లలలో మానసిక సమస్యలతో పాటుగా అనేక సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఇండ్లాస్ చైల్డ్ క్లినిక్ నందు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది అన్నారు. చిన్న పిల్లలకు సంబంధించి నూతన వైద్యం అందించేందుకు క్లినిక్ ప్రారంభించడం అభినందనీయం అని అన్నారు. ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మానసిక సమస్యలకు అందరికీ అందుబాటులో వైద్యం అందించాలని సరికొత్త మార్పులతో చైల్డ్ క్లినిక్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ ఆర్.వేంకటేశ్వర రావు, మానసిక వైద్యుల డాక్టరు విశాల్ ఇండ్ల, ఇండ్లాస్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ స్వప్న ఇండ్ల, పలువురు నగర వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ట్రస్ట్ జాయింట్ సెంటర్ ప్రారంభం



విజయవాడ,ప్రజాపాలన,ప్రతినిధి :ప్రపంచ స్థాయి సాంకేతిక సదుపాయాలతో, దేశ విదేశాల్లో సుశిక్షితులైన నిపుణుల ఆధ్వర్యంలో, కీళ్ల సంరక్షణకు ప్రత్యేక కేంద్రంగా తీర్చిదిద్దబడిన ట్రస్ట్ జాయింట్ సెంటర్ ఆదివారం ప్రారంభించబడింది. బెంజ్ సర్కిల్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయం రోడ్డులో జరిగిన హాస్పిటల్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారభించగా, మరో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, వైసీపీ నేతలు దేవినేని అవినాష్, బొప్పన భవకుమార్, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై ట్రస్ట్ జాయింట్ సెంటర్ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర మంత్రి జోగి రమేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యాధునిక రోబోటిక్ వైద్య సేవలను ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తేవడం అభినందనీయమని అన్నారు. ట్రస్ట్ హాస్పిటల్ ద్వారా ప్రజలకు సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న డాక్టర్ యు. వెంకటరమణ సారథ్యంలో ప్రపంచస్థాయి ఆసుపత్రి నెలకొల్పబడటం హర్షణీయమని మంత్రి కొనియాడారు. ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్, ట్రస్ట్ జాయింట్ కేర్ చైర్మన్ డాక్టర్ యు. వెంకట రమణ మాట్లాడుతూ కీళ్ల సమగ్ర సంరక్షణ, దెబ్బతిన్న కీళ్ల పనితీరును పునరుద్ధరించే లక్ష్యంతో ట్రస్ట్ జాయింట్ సెంటర్ ఏర్పాటయిందని అన్నారు. అనుభవజ్ఞులైన సర్జన్ల బృందం, అధునాతన జాయింట్ సేవింగ్ కార్టిలేజ్‌తో పునరుత్పత్తి చికిత్సలు, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్స్, కీళ్ల సమస్యలు, క్రీడా గాయాలకు నిరంతర సేవలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ వెంకటరమణ వెల్లడించారు. ట్రస్ట్ జాయింట్ సెంటర్ నందు అందుబాటులో ఉన్న అంతర్జాతీయ స్థాయి చికిత్సలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ భార్గవరామ్ కోరారు. కాంప్లెక్స్ ట్రామా, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ సీహెచ్.ఎస్. నిశాంత్ మాట్లాడుతూ, ట్రస్ట్ జాయింట్ సెంటర్ ద్వారా నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ కీళ్ల పునరుద్ధరణ, కీళ్ల పునర్నిర్మాణం తదితర ఆధునిక చికిత్సలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రిటికల్ కేర్, అనస్థీషియా నిపుణులు డాక్టర్ ఎన్. పావన ఫణి, వివిధ రంగాలకు చెందిన నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## కొలికపుడి శ్రీనివాసరావుకి స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట జులై 23 ప్రజాపాలన ప్రతినిధి:ఆర్5 జో న్ పేరుతో ప్రభుత్వ విధానానికి నిరసనగా కొలకపొడి శ్రీనివాసరావు పాదయాత్ర రాజధాని నుండి రాజధాని కోసం ఉమ్మడి రాజధాని హైదరాబాదులో ఎన్టీఆర్ ఘాట్ వద్ద నుండి అమరావతిలో నరేంద్ర మోడీ శంకు స్థాపన చేసిన స్థలం వరకు చేపట్టిన పాదయాత్ర 7 వ రోజు ఆంధ్ర లో జగ్గయ్యపేట నియోజకవర్గం లోకి అ డుగు పెడుతున్న అమరావతి రాజధాని పరిరక్షణ స మితి చైర్మన్ కొలికపుడి శ్రీనివాసరావుకి స్థానిక తెదే పా నేతలు, రైతులు రైతు సంఘాలతో కలిసి నియోజ కవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య , నెట్టెం శివరాం, శ్రీరాం చిన్నబాబుస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి రామకృష్ణారెడ్డి, ఆచంట సునీత, వడ్లమూడి శ్రీనివాస్, అమ్మనబో యి న ప్రభాకర్, అమ్మనబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# సాహితీ పిపాసి కొట్టి రామారావుకి ఘన నివాళులు...!

## పాల్గొన్న మచిలీపట్నం సాహిత్య సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు...!



మచిలీపట్నం, టౌన్ జులై 23: ప్రజాపాలన : సాహితీ రంగంలో రాలిపోయిన అమృతమూర్తి కొట్టి రామారావు అని సీనియర్ న్యాయవాది, లంకిశెట్టి బాలాజీ కొనియాడారు. 'సాహితీ తపస్వి' ఆంధ్ర సారస్వత సమితి అధ్యక్షులు కొట్టి రామారావు సంతాప సభ ఆదివారం స్థానిక వివేకానంద మందిరంలో సాహిత్య సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర సారస్వతి సమితి ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ సాహితీ రంగంలో రాలిపోయిన అమృతపుష్పం కొట్టి రామారావు అని కొనియాడారు. మంచితనం ఎక్కడ కనిపించినా జై 'కొట్టి' ఆదరించగలవు వంచకులని , తెలిస్తే తొడ 'కొట్టి' ఎదిరించగలవు, మంచి చెడుల మధ్య రాజీపడని మనస్తత్వం నీది, యువతలో కవితను తట్టి లేపగల ధీశాలివి, రామా రావు అని అన్నారు. నమ్మిన సత్యానికి సర్వస్వం అమ్మగల పట్టుదల నీది, అన్న జిసనారా రాసిన వాస్తవాన్ని లంకి శెట్టి బాలాజీ గుర్తు చేశారు. ప్రముఖ వైద్యులు ధన్వంతరి ఆచార్య మాట్లాడుతూ తాను వైద్యునిగా ప్రాక్టీసు మొదలుపెట్టినప్పటి నుండి కొట్టి రామారావు తో తనకున్న పరిచయాన్ని గుర్తు చేసుకుంటూ , తాను అనుకున్నది సాధించే వరకు పట్టు వదలని వ్యక్తిత్వం గల గట్టి తపన ఉన్న వ్యక్తి కొట్టి అని అన్నారు. సాహిత్యంలో అందరినీ తట్టి లేపే మనస్తత్వం ఉన్న కొట్టి రామారావు లేని లోటు మరువలేనిది అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ టి .పెద్దిరాజు మాట్లాడుతూ మచిలీపట్నం సాహితీరంగాన్ని పెంచి పెద్ద చేసిన ఒక మహా వృక్షం నేలకొరిగిందని వ్యాఖ్యానించారు. తెలుగు భాషాభ్యున్నతికి, భాషా సేవకు ఆయన చేసిన కృషి, తపన అనిర్వచనీయమన్నారు. చరిత్ర అధ్యాపకులు సవరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో గుప్త దానాలు అందించిన విశిష్ట వ్యక్తి అన్నారు. ప్రముఖ కవి చింతలపాటి మురళీకృష్ణ తన పద్యాలతో స్వీయ కవిత్వంతో కొట్టి రామారావు కి ఘన నివాళులర్పించారు. నీ మైత్రికి కేంద్ర గ్రంథాలయం,నీ ప్రతిభకు ,బందరు పురమందిరంనీ సాహిత్య సేవకు జూబ్లీహాలు, నివాళు లర్పిస్తున్నాయన్నారు. మీ సభా నిర్వహణ కడు రమ్యం, మీరు నిర్వహించిన వార్షికోత్సవ సంబరాలుమాకు మరుపురాని మధుర క్షణాలుఅంటూ విడియాల చక్రవర్తి నివాళులర్పించారు. అక్షరాన్ని ఆరాధిస్తా ప్రకృతిని ప్రేమిస్తాఅదే బలంతో కవిత్వం రాస్తా అంటూ కవిత్వం రాసి ఎన్నో ప్రక్రియులలో రచనలు చేసి మచిలీపట్నం ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న రామారావు సేవలకు గుర్తుగా మచిలీపట్నం నగరపాలక సంస్థలో ఒక వీధికి సాహితీ తపస్వి కొట్టి రామారావు వీధి అని నామకరణం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ శాస్త్రి, అనుమకొండ వెంకటేశ్వరరావు, కొల్లూరు రామ్మోహన్రావు ,భవిష్య చింతలపాటి పూర్ణ చంద్ర రావు, రామనాథం, అప్పినేడి పోతరాజు, ఆంజనేయులు, రాధాకృష్ణమూర్తి గుడిపూడి రాధికా రాణి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొని కొట్టి రామారావుకి ఘన నివాళులర్పించారు



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
సోమవారం 24, జులై 2023

# నేనున్నానంటూ.. ఆపదలో భరోసా

నాయకులందరూ ప్రజల ఓట్లతోనే గెలుస్తారు. గెలిచిన వారందరూ కొద్దో గొప్పో ప్రజాసేవ చేస్తుంటారు. వారిలో కొందరే ప్రజల మనసులను గెలుస్తారు. ఆ కొందరిలో ఒక్కరో ఇద్దరో మాత్రమే బాధ్యతగా తమను గెలిపించిన ప్రజలను కూడా గెలిపిస్తారు. ప్రజలు వాళ్ల జీవితాలను గెలుచుకునేలా తోడుగా, నీడగా, అండగా నిలుస్తారు. అలా నిలిచిన నాయకుడే మన కేటీఆర్. ఆయన ప్రజా నాయకుడే కాదు.ప్రజల నాయకుడు. ప్రజలను గెలిపిస్తున్న నాయకుడు.దయార్ద్ర హృదయుడే కాదు, నాయకుడిగా తన బాధ్యతలు తెలిసి దయాగుణంతో స్పందిస్తున్నవాడు. తాను నమ్మిన ప్రజలకు, తనను నమ్మిన ప్రజలకు తోడుగా నీడగా ఉండాలన్న తపన ఉన్నవాడు. తపన ఉండటమే కాదు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తున్నవాడు. కేవలం ట్విట్టర్‌లో ఒక మెసేజ్ పెడితే చాలు, వెంటనే బాధ్యతగా స్పందిస్తున్నవాడు.ఆ పేరే ఒక చైతన్యం ఆ రూపంలో ఒక దయాగుణం. అంతే కాదు, అతను ఒక గొప్ప పరిపాలనాదక్షుడు. కాలానికి అనుగుణంగా ఈ సమాజానికి ఏం కావాలో గుర్తించేవాడు. గుర్తించడమే కాదు, యువత కలలను నిజం చేసేవాడు. నిరుద్యోగ సమస్యను తీర్చి యువతకు ఉపాధి కల్పించడంలో కేటీఆర్ అందరికంటే ముందున్నారు.ఎక్కడో ఆదిలాబాద్ అడవుల్లో ఓ పసికూన అనారోగ్యంతో తల్లడిల్లిపోతుంది. వైద్యం అందుబాటులో ఉండదు. ఉన్నా చేయించుకునే స్థోమత ఉండదు. తల్లిదండ్రులు ఆశ చాలించుకుంటారు. అమ్మాయి పడక మీద చావును ఆహ్వానిస్తూ అవస్థలు పడుతుంది. ఎవరో చెప్తే మిణుకు మిణుకు మంటున్న ఆశతో చివరిసారిగా ఆ తండ్రి కేటీఆర్ ట్విట్టర్‌ను ఆశ్రయిస్తాడు. ఒక్కసారిగా ధర్మగంట మోగుతుంది. ఆఫీసు అలర్ట్ అవుతుంది. అందాల్సిన సహాయం సమయానికి అందుతుంది. చచ్చిపోతుందనుకున్న ఆ చిన్నారి చిరునవ్వుతో బతికి బయటపడుతుంది. ఆ తల్లిదండ్రుల కళ్లల్లో వెలుగు నిండుతుంది.ఎక్కడో ఖమ్మంలో ఓ మారుమూల పల్లెలో ఓ చదువుల తల్లికి ఉన్నత చదువుల్లో సీటు వస్తుంది. చదువాలని ఉంటుంది. కానీ చదువలేని పరిస్థితి. ఫీజులు కట్టడానికి డబ్బులుండవు. తల్లిదండ్రులు చేతులెత్తేస్తారు. చదివినకాడికి చాల్లే ఓ కుట్టుమిషనో, బీడీలో నేర్చుకొని బతుకుదెరువును చూసుకోమంటారు. ఆత్మను చంపుకోలేక, అలాగని చదువలేక ఆ తల్లి తనలో తాను ఏడుస్తూ తల్లడిల్లి పోతుంది. ఎవరో చెప్తే చివరి ఆశగా 'అన్నా నన్ను ఆదుకో' అని ట్విట్టర్‌లో ఓ నాలుగు మాటలు రాస్తుంది. అంతే ఇక్కడ ధర్మగంట మోగుతుంది. ఆఫీసు అలర్ట్ అవుతుంది. అందాల్సిన సహాయం సమయానికి అందుతుంది. ఆ అమ్మాయి చిరునవ్వుతో కాలేజీ మెట్లు ఎక్కుతుంది. ఆమె ఆశ నెరవేరినందుకు ఆ తల్లిదండ్రుల మొహంలో చిరునవ్వు విరుస్తుంది. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఒక్కటి కాదు, రెండు కాదు. ఇలాంటివి మరెన్నో వందల మందికి అతను ఆపదలో ఆదుకునే ఒక భరోసా. ఎక్కడో ఎవరో ఏదో చిన్న ఆపదలో ఉండి అన్నా అని సహాయం కోసం అర్థిస్తే నేనున్నానని తన సైన్యంతో ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకునే ఒక గొప్ప మహోన్నత మనస్తత్వం ఆయనది. తెలంగాణలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుగా గుర్తొచ్చేది కేటీఆర్. అందరికీ అందుబాటులో ఉంటూ ఆపదలకు స్పందిస్తూ తర తమ భేదం లేకుండా నేనున్నానని ధీమా ఇచ్చే నాయకుడు కేటీఆర్.ఆ పేరే ఒక చైతన్యం ఆ రూపంలో ఒక దయాగుణం. అంతే కాదు, అతను ఒక గొప్ప పరిపాలనాదక్షుడు. కాలానికి అనుగుణంగా ఈ సమాజానికి ఏం కావాలో గుర్తించేవాడు. గుర్తించడమే కాదు, యువత కలలను నిజం చేసేవాడు. నిరుద్యోగ సమస్యను తీర్చి యువతకు ఉపాధి కల్పించడంలో కేటీఆర్ అందరికంటే ముందున్నారు. ఐటీ రంగానికి ఆయన ఒక ఐకాన్. ఐటీ హబ్‌లను ఏర్పాటుచేస్తూ వేల మందికి ఉపాధినివ్వడంతో పాటు దేశదేశాలు తిరిగి ప్రపంచ దిగ్గజాలు అనుకున్న అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, క్వాల్కమ్, ఒరాకిల్, నొవార్టిస్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మైక్రాన్, డెల్ లాంటి వందల కంపెనీలను తెలంగాణకు తెచ్చి లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు.తన చొరవతో రాష్ట్రం నుంచి ఐటీ ఎగుమతులు 2021–22లో రూ.1,83,569 కోట్లు కాగా 2022–23 నాటికి రూ.2,41,275 కోట్లకు పెరిగాయి. ఈ 57,706 కోట్ల పెంపు తెలంగాణ ఏర్పాటైన తర్వాత అత్యధిక వార్షిక పెరుగుదల. తన చొరవ పట్టుదలతోనే ఐటీ/ఐటీఈఎస్ రంగంలో రాష్ట్రం వేగంగా పురోగమిస్తున్నది. రెండవ ఐసీటీ పాలసీ ప్రకారం 2026 వరకు 3 లక్షల కోట్ల ఎగుమతులు, 10 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని నిర్దేశించుకోగా 2024 నాటికే ప్రతిష్ఠాత్మకమైన ఆ మైలురాళ్లను సాధించే దిశగా అడుగులు వేస్తున్నది. అందులో కేటీఆర్ కృషి ఎంతో ఉన్నది. అంతే కాదు. ఆయన రాజకీయ చతురుడు. గతాన్ని పునాదిగా చేసుకొని వర్తమానం మీద భవిష్యత్తును అందంగా నిర్మించగల ఒక గొప్ప రాజనీతిజ్ఞుడు. రాజకీయ నాయకుడిగా ఆయన తన ప్రస్థానం మొదలుపెట్టినప్పుడు నిజంగా ఒక ఆణిముత్యం. ఇప్పుడూ అంతే.. ఆయన మనసు నవనీతం. రాజకీయాల్లో ఎలా ఇముడుతాడో అనుకుంటే ఇప్పుడు రాజకీయాలకే దిశానిర్దేశం చేసే స్థాయికి ఎదిగారు. అసలు ఆయన రాజకీయ ప్రస్థానమే ఉద్యమంతో మొదలైంది. తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో ఉండి కొట్లాడి ఉద్యమానికి నాయకత్వం వహించి లక్షల మందిని కదిలించి, మెప్పించి, ఒప్పించి తెలంగాణ సాధనలో ముందున్నారు. పార్టీ పగ్గాలు చేతబట్టి తన విలక్షణ ఆలోచనా విధానంతో శత్రువులకు దీటైన సమాధానం ఇచ్చారు. ఇప్పుడు రాజకీయాలే ఆయన చుట్టూ తిరుగుతున్నాయి. నాయకులంతా ఇలా ఉంటే నిజంగా ప్రజలకు మేలు జరుగుతుంది. కాలానికనుగుణంగా కొందరు నాయకులు తయారుకావచ్చు. కానీ మారుతున్న కాలం తనకనుగుణంగా కొందరు నాయకులను తయారుచేసుకుంటుంది. అలా ఎదుగుతున్న కాలం తన కోసం తయారుచేసుకున్న ఉత్తమ నాయకుడే కేటీఆర్.

# "నవయుగ కవి - జాషువా"

## నేడు మహాకవి గుర్రం జాషువా 52వ వర్ధంతి సందర్భంగా నివాళులు..


దాసన్న గారి కృష్ణమూర్తి

ఆటవిక యుగం నుండీ ఆధునిక యుగం దాకా నడుస్తోంది ఆధిపత్య సమాజమే. దైనందిన మానవ జీవన అవసరాల కోసం ఏర్పడిన జాతులు, వృత్తులు, సమూహాలుగా ఏర్పడిన రూపాలు, రాను రాను వృత్తి కులాలై, అవే తర్వాత కాలంలో కులవృత్తులుగా రూపాంతరం చెందినాయి. ఆ తర్వాతే కాస్త అక్షరం తోడై మనుధర్మం పేర చాతుర్వర్ణ సమాజంగా, అదీ మరీ కులాల వ్యవస్థగా స్థిరపడటం గమనార్హం, అప్పటినుండీ వేదాలు పురాణాల ప్రవేశంతో సనాతన భారత దేశంగా మానవ జాతి యావత్తు ఆధిపత్య వర్ణాధీనంలో కట్టుబడి వుందిఅక్షరంనుండీ అంతరిక్షం దాకా ఆధునిక ప్రపంచ విద్యా వైజ్ఞానిక శాస్త్రం ఎంతో అభివృద్ధి చెంది, మనిషి మేధకు, జ్ఞానానికి ప్రాముఖ్యత మొదలై, అన్నిరంగాలలోకి కూడా వెళ్ళింది. తత్భిన్నంగా జ్ఞానభూమిగా కీర్తించే భారతీయ సమాజంలో మాత్రం వర్ణ కుల వర్గ విభజితమై, మేధోసంపద యావత్తు, కులపరమైన గుర్తింపు, ప్రాధాన్యతగా మారింది.అందులో సాహిత్యరంగంలో, కవులు, సాహితీవేత్తలు కూడా ఆనాటి సవర్ణ బాధితులు, కావడం గమనించాలి. అలాంటి విపత్కర సంఘర్షణల సంఘాన్ని చీల్చుకుంటూ అస్పృశ్య కులాల వెలివాడల ఇంట ఉద్భవించి , మహోద్యమతారగా వెలుగొందిన "పద్యకవి" గుర్రం జాషువా.వారి సాహితీ స్మరణ ప్రస్తావనా పరిచయమే ఈ వ్యాసం. ఇది వారి సాహిత్యం ప్రజాజీవనంలో భాగం.జాషువా జీవితం నాల్గు తలల కులకర్కశ హైందవ విష పడగల నీడన ఎదిగి విశ్వకవి అయ్యాడు.జాషువా పుట్టుక, బాల్యం, ఎదుగుదల అంతా అస్పృశ్యత, ఆకలి, కులం, మతం, వెక్కిరింతల నడుమ అవమాన భరితమైంది. అయినా క్రుంగి పోలేదు. జాషువా స్వతహాగా మానవతావాది, అత్మాభిమాని కూడా, కసి,పట్టుదలతో ధిక్కార కలంతో, 'సవర్ణ కలాల'పై అక్షర ఆయుధంతో పోరాడి గెలిచిన పంచవర్ణ యోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి. తనను చీత్కరించిన వినుకొండ నేలపైనే జేజేలు అందుకుని, గజారోహనుడై, పురవీధుల ఊరేగింపుతో గండపెండేర దారుడైన సత్కవీంద్రుడు జాషువా. వీరి సాహిత్యం వీరి జీవితం, సమాజం వేరుకాదు. అందుకే జాషువా రాసిన ప్రతీ పదంలో తన అనుభవాల ఆలోచనలే అక్షర రూపాలైనాయి. జాషువా దాదాపు 30 కి పైగా రచనలు చేశాడు. గబ్బిలం, ఫిరదౌసి, స్వప్నకథ, అనాధ, కొత్తలోకం, ముంతాజ్ మహల్, నాకథ, మరియు కథలు, నాటకాలు, కావ్యాలు, రాశాడు. అవధాని, ఆకాశవాణి వ్యాఖ్యాత, ఎమ్మెల్సీ, ఉపాధ్యాయుడు ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఎన్నో ప్రభుత్వ, ప్రభుత్వేతర సన్మానాలు, సత్కారాలు, ఉత్తమ పురస్కారాల గ్రహీతగా ఆధునిక భారతానికి "నవయుగ కవి" అయ్యాడు జాషువా.'కులమతాలు గీచుకున్న గీతల జొచ్చి / పంజరాన కట్టుబడను నేను / నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు /తరుగులేదు విశ్వనరుడు నేను ' ఈ ఒక్క పద్యం చాలు జాషువా యొక్కవ్యక్తిత్వం, సాహిత్యం ఎవ్వరికైనా అర్థ మవుతుంది. ఈ కులమతాల రొంపిలో తాను కూరుకుపోలేదు. నేను విశ్వ మానవుడని



ప్రకటించుకున్న దీశాలి.జాషువా తన ఆత్మ నివేదనను 'గబ్బిలం ' కావ్య రూపంలో ఈశ్వరునికి సందేశంగా పంపడం ఒక విప్లవాత్మకం. ఇక్కడ కవి ఎంచుకున్న వస్తువు, నేపథ్యం, ప్రదేశం, బహుశా సాహిత్య చరిత్రలో ఓ సరికొత్త అధ్యాయానికి, సంస్కరణలకు తెర తీసిందనవచ్చు."ఆలయంబున నీవు వ్రేలాడువేళ / శివుని చెవి నీగు గొంతు చేరువుగ నుండు / మౌని ఖగరాగ్ని, పూజారి లేనివేళ / విన్నవింపుము నాదు జీవిత చరిత్ర " ఇలా గబ్బిలానికి నివేదిస్తాడు.తరాలుగా వెలివేయబడ్డ అస్పృశ్య కులవృత్తి చేసుకునే అరుంధతి సుతుడికి ఈదేశంలో స్థానం గురించి ఇలా "ముప్పుఘటించే వీని కులమున్ గబలించి దేహమున్ / బిప్పియొనర్చు నీ భరతవీరుని పాదము కందకుండగా/ జెప్పులు గుట్టి జీవనము సేయునుగాని నిరాకరింప లే/ దెప్పుడు నప్పువడ్డది సుమీ భరతావని వీని సేవకున్ " ఇక్కడ భారత కులసమాజాన్ని నిలదీస్తూ ప్రశ్నించాడు జాషువా. అంతేకాదు... '...వాడు చెమటోడ్చి ప్రపంచమునకు భోజనం పెట్టువానికి భుక్తి లేదంటాడు ' అస్పృశ్యత, కులం అనే వికృత భావం హిందూ మతంలో విషత్వంగా అవహించిందని ఇలా "ఆ యభాగ్యుని రక్తంబు నా హరించి / ఇనుప గజ్జెలతల్లి జీవనము సేయు / గసరి బుసకొట్టు నాతని గాలిసోక / నాల్గుపడగల హైందవ నాగరాజు"ఇది జాషువా జీవితంలో నుండీ పెల్లుబికిన ఆవేదన, అంతర్మథనం, పద్యోద్వేగం. పద్యోద్వేషం '."చిక్కిన కాసుచేదనివి జెందు నమాయకుడెల్ల కష్టముల్ / బొక్కెడు బువ్వతో మరచిపోవు క్షుధానల దగ్ధమూర్తిన / నల్దిక్కులుగల్గు లోకమున దిక్కరియున్న యరుంధతీ సుతుం / డొక్కడు జన్మమెత్తె భరతోర్వరకుం గడగొట్టు బిడ్డడై"బొక్కెడు బువ్వతో తృప్తి పడే క్షుధానల దగ్ధ మూర్తి.. అంటూ అద్భుత పద ప్రయోగం చేసాడు. అరుంధతి మాత పుత్రుడైనా భరతమాత ఒడిలో మాత్రం ఆఖరు సంతానంగా వేరు చేసారని, వెలివేశారని అంటాడు. అంతేకాదు రాజకీయ నాయకులు కూడా కులాల నాయకులై, రాజకీయ బానిసలై స్వజాతిని మోసం చేస్తారని ఈవిధంగా చెబుతున్నాడు...
"చేతులెత్తుడన్న చేతులెత్తెడివారు / నిలువుడన్న లేచి నిలుచువారు / చదువుకొన్నవారు చదువెరుంగని వారు / నుభయ సభలలోను నుందు రచట " పార్లమెంట్, శాసన శాసన సభలలో నేటి రాజకీయ నాయకుల తీరును ఆనాడే హెచ్చరికగా చెప్పాడు. ఇది నేటికీ ప్రత్యక్షంగా వారి తీరును చూడవచ్చు. "నరుని కష్టపెట్టి నారాయణుని గొల్చు / ధర్మశీలురున్న ధరణి మీద / కాలుమోపలేక గబ్బిలమొక్కటే / చరణయుగళి దివికి సాచినడు ""అల్లావో మరియాతనూజుడవో! యబ్జాక్షుండవో! శాంబరీ/ భిల్లాస్వామివో! బుద్ధ దైవతమవో! వేదాంత శాస్త్రాళిలో / వల్లింపబడు శబ్ద రూపుడవో! విస్పష్టంబుగావించి మ / మ్మల్లాడింపక తేల్చిపొమ్ము భవదీ యజ్ఞాత రూప స్థితుల్ " కులమత వివక్షతలపై అన్ని భారతీయ మత దేవతల్ని, అన్యమత దేవుళ్లందరిని, దేవుళ్లను కొలిచే ధర్మబద్ధులను ప్రశ్నించాడు జాషువా.నిజానికి ఆనాటి సాంఘిక పరిస్థితులలో.. సంస్కృత భాషా పద పాండిత్యంతో, బ్రాహ్మణీయ భావజాలంతో, సమాజంలో రాజాదరణతో ఆధిపత్యం చెలాయిస్తుంటే, జాషువా పద్య సాహిత్యంలో ఒక్కడంటే ఒక్కడై జాషువా తన పుట్టుక, ఆకలి, కులం, మతం, నేర్పిన జ్ఞానపరిపక్వత వెరసి రసజ్ఞ పండిత పామర లోకాన్నీ తనవైపు కదిలించాడు, కల్లోల పరిచాడు, ప్రశ్నించాడు, ధిక్కరించాడు. కానీ ఎక్కడా ఆక్రోషం, విద్వేషం వెల్లగక్కలేదు, అసహ్యించు కోలేదు, అక్షరాయుత అసహనం చూపాడు, వ్యవస్థపై కోపాన్ని, బాధను వ్యక్తులకు ఆపాదించలేదు. కవిగా అవమాన పర్వంలో ఓ సంఘటన.."నాకవితా వధూటి వదనంబు నెగాదిగా జూచి రూపురే/ ఖా కమనీయ వైఖరుల గాంచి, 'భళీ! భళీ' యన్నవాడె మీ / దేకులమన్న ప్రశ్న వెలయించి చివాక్కున లేచిపోవుచో / బాకున గ్రుమ్మినట్లగున్ పార్థివచంద్ర! వచింప సిగ్గగన్ " జాషువా రూపంలో అందగాడు,చక్కని మీసం, తెల్లని పంచెకట్టుతో ఎంతో గంభీరంగా కనిపిస్తాడు. చూపరులకు తానేవ్వరో పండిత శ్రేష్ఠుడివోలె అగుపిస్తే, తన సాహిత్యం విని, చాంధస వాదులు తన కులాన్ని ప్రశ్నించారని వాపోయాడు.
అన్నార్థుల ఆకలి వ్యధలను విస్మరించిన, రేడియో కవితలపై తన కవితలో ఇలా చెప్పాడు."రేయిబవలు భారతీయ సంస్కృతీ పేర / గండశిలలు చూపి కథలు చెప్పి / కటిక పేదవాని కడుపులోగల చిచ్చు / గడపగలవే నీవు గగనవాణి " తెలుగు సాహిత్య చరిత్రలో తనకూ స్థానం ఉందంటాడు ఈ పద్యంలో... "తెలుగు వాంఘ్మయలక్ష్మి కలికి దేహము నందు / కలువా నిర్మాణ కలవ కొంత / సకలాంధ్ర కవికోటి జాబితా లోపల / నా నామమునకు స్థానంబు గలదు" అని ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్పుకున్నాడు. కవిఘనతను వివరిస్తూ "రాజు మరణించె నొకతార రాలిపోయె / కవియు మరణించె నొక తార గగనమెక్కె / రాజు జీవించె రాతి విగ్రహములందు / సుకవి జీవించె ప్రజల నాలుకలయందు" తరాల సాహిత్య చరిత్రను ప్రక్షాళన చేసి నూతన వొరవడిని ఆవిష్కరణ చేశాడు. సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ కవుల దృక్పధానికి దిక్సూచిగా, నిర్భీతిగా తొలి అడుగులు వేశాడు, నేటికీ, రేపటి తరాలకు సాహితీ నిఘంటువుగా నిలిచాడు జాషువా. అందుకే యుగాల తీరును మార్చి వినూత్న విశ్వమానవ చరిత్రను లిఖించి మహాకవి "నవయుగకవి " అయ్యాడు, భావితరాలకు మార్గదర్శిగా, సుకవిగా ప్రజల నాల్కలపై తెలుగునోట చిరస్మరణీయుడు.మహాకవి గుర్రం జాషువాకు అక్షర నివాళిగా...
" సనాతన సాహితీ సరిహద్దులున్ దాటి / పండిత మేధో పద నీశీదిని చీల్చుకుని/ అభ్యుదయాక్షరశ్మితంబై కలమున్ చేబట్టి/ అబ్బురపరచెన్ గబ్బిల కావ్యంబై విశ్వనరుడు".

# నేనున్నానంటూ.. ఆపదలో భరోసా

నాయకులందరూ ప్రజల ఓట్లతోనే గెలుస్తారు. గెలిచిన వారందరూ కొద్దో గొప్పో ప్రజాసేవ చేస్తుంటారు. వారిలో కొందరే ప్రజల మనసులను గెలుస్తారు. ఆ కొందరిలో ఒక్కరో ఇద్దరో మాత్రమే బాధ్యతగా తమను గెలిపించిన ప్రజలను కూడా గెలిపిస్తారు. ప్రజలు వాళ్ల జీవితాలను గెలుచుకునేలా తోడుగా, నీడగా, అండగా నిలుస్తారు. అలా నిలిచిన నాయకుడే మన కేటీఆర్. ఆయన ప్రజా నాయకుడే కాదు.ప్రజల నాయకుడు. ప్రజలను గెలిపిస్తున్న నాయకుడు.దయార్ద్ర హృదయుడే కాదు, నాయకుడిగా తన బాధ్యతలు తెలిసి దయాగుణంతో స్పందిస్తున్నవాడు. తాను నమ్మిన ప్రజలకు, తనను నమ్మిన ప్రజలకు తోడుగా నీడగా ఉండాలన్న తపన ఉన్నవాడు. తపన ఉండటమే కాదు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తున్నవాడు. కేవలం ట్విట్టర్‌లో ఒక మెసేజ్ పెడితే చాలు, వెంటనే బాధ్యతగా స్పందిస్తున్నవాడు.ఆ పేరే ఒక చైతన్యం ఆ రూపంలో ఒక దయాగుణం. అంతే కాదు, అతను ఒక గొప్ప పరిపాలనాదక్షుడు. కాలానికి అనుగుణంగా ఈ సమాజానికి ఏం కావాలో గుర్తించేవాడు. గుర్తించడమే కాదు, యువత కలలను నిజం చేసేవాడు. నిరుద్యోగ సమస్యను తీర్చి యువతకు ఉపాధి కల్పించడంలో కేటీఆర్ అందరికంటే ముందున్నారు.ఎక్కడో ఆదిలాబాద్ అడవుల్లో ఓ పసికూన అనారోగ్యంతో తల్లడిల్లిపోతుంది. వైద్యం అందుబాటులో ఉండదు. ఉన్నా చేయించుకునే స్థోమత ఉండదు. తల్లిదండ్రులు ఆశ చాలించుకుంటారు. అమ్మాయి పడక మీద చావును ఆహ్వానిస్తూ అవస్థలు పడుతుంది. ఎవరో చెప్తే మిణుకు మిణుకు మంటున్న ఆశతో చివరిసారిగా ఆ తండ్రి కేటీఆర్ ట్విట్టర్‌ను ఆశ్రయిస్తాడు. ఒక్కసారిగా ధర్మగంట మోగుతుంది. ఆఫీసు అలర్ట్ అవుతుంది. అందాల్సిన సహాయం సమయానికి అందుతుంది. చచ్చిపోతుందనుకున్న ఆ చిన్నారి చిరునవ్వుతో బతికి బయటపడుతుంది. ఆ తల్లిదండ్రుల కళ్లల్లో వెలుగు నిండుతుంది.ఎక్కడో ఖమ్మంలో ఓ మారుమూల పల్లెలో ఓ చదువుల తల్లికి ఉన్నత చదువుల్లో సీటు వస్తుంది. చదువాలని ఉంటుంది. కానీ చదువలేని పరిస్థితి. ఫీజులు కట్టడానికి డబ్బులుండవు. తల్లిదండ్రులు చేతులెత్తేస్తారు. చదివినకాడికి చాల్లే ఓ కుట్టుమిషనో, బీడీలో నేర్చుకొని బతుకుదెరువును చూసుకోమంటారు. ఆత్మను చంపుకోలేక, అలాగని చదువలేక ఆ తల్లి తనలో తాను ఏడుస్తూ తల్లడిల్లి పోతుంది. ఎవరో చెప్తే చివరి ఆశగా 'అన్నా నన్ను ఆదుకో' అని ట్విట్టర్‌లో ఓ నాలుగు మాటలు రాస్తుంది. అంతే ఇక్కడ ధర్మగంట మోగుతుంది. ఆఫీసు అలర్ట్ అవుతుంది. అందాల్సిన సహాయం సమయానికి అందుతుంది. ఆ అమ్మాయి చిరునవ్వుతో కాలేజీ మెట్లు ఎక్కుతుంది. ఆమె ఆశ నెరవేరినందుకు ఆ తల్లిదండ్రుల మొహంలో చిరునవ్వు విరుస్తుంది. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఒక్కటి కాదు, రెండు కాదు. ఇలాంటివి మరెన్నో%శా% వందల మందికి అతను ఆపదలో ఆదుకునే ఒక భరోసా. ఎక్కడో ఎవరో ఏదో చిన్న ఆపదలో ఉండి అన్నా అని సహాయం కోసం అర్థిస్తే నేనున్నానని తన సైన్యంతో ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకునే ఒక గొప్ప మహోన్నత మనస్తత్వం ఆయనది. తెలంగాణలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుగా గుర్తొచ్చేది కేటీఆర్. అందరికీ అందుబాటులో ఉంటూ ఆపదలకు స్పందిస్తూ తర తమ భేదం లేకుండా నేనున్నానని ధీమా ఇచ్చే నాయకుడు కేటీఆర్.ఆ పేరే ఒక చైతన్యం ఆ రూపంలో ఒక దయాగుణం. అంతే కాదు, అతను ఒక గొప్ప పరిపాలనాదక్షుడు. కాలానికి అనుగుణంగా ఈ సమాజానికి ఏం కావాలో గుర్తించేవాడు. గుర్తించడమే కాదు, యువత కలలను నిజం చేసేవాడు. నిరుద్యోగ సమస్యను తీర్చి యువతకు ఉపాధి కల్పించడంలో కేటీఆర్ అందరికంటే ముందున్నారు. ఐటీ రంగానికి ఆయన ఒక ఐకాన్. ఐటీ హబ్‌లను ఏర్పాటుచేస్తూ వేల మందికి ఉపాధినివ్వడంతో పాటు దేశదేశాలు తిరిగి ప్రపంచ దిగ్గజాలు అనుకున్న అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, క్వాల్కమ్, ఒరాకిల్, నొవార్టిస్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మైక్రాన్, డెల్ లాంటి వందల కంపెనీలను తెలంగాణకు తెచ్చి లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు.తన చొరవతో రాష్ట్రం నుంచి ఐటీ ఎగుమతులు 2021–22లో రూ.1,83,569 కోట్లు కాగా 2022–23 నాటికి రూ.2,41,275 కోట్లకు పెరిగాయి.

## మున్సిపాలిటీలో వంద కోట్ల అభివృద్ధి ఎక్కడ, సైడ్ డ్రైనేజ్, వ్యవస్థ సక్రమంగా లేక రోడ్లు పై పారుతున్న మురుగు నీళ్లు



మధిర రూరల్ జూలై 23 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ సైడ్ సక్రమంగా లేక రోడ్డుపై పారుతున్న మురికి నీళ్లు చెత్తాచెదారంతో అస్తవ్యస్తంగా ఉన్న మున్సిపాలిటీవర్షం వస్తే నరకాయతన పడుతున్న మధిర ప్రజలు,గరిడేపల్లి వేణుబీజేపీ,ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు2013 లో అత్కూర్ నుండి, మధిర మార్కెట్ యార్డ్ వరకు నాలుగు వరసల రహదారి, రెండు వైపులా సైడ్ డ్రైనేజీ నిర్మాణం అన్నారు, ఈ నాటికీ కాంగ్రెస్ ఆఫీస్ నుండి,అంబేద్కర్ సెంటర్, వరకు మరియు ఎస్సీ కాలనీ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు సైడ్ డ్రైనేజీ నిర్మించకుండా వదిలేసినా, పట్టించుకోని స్థానిక, ఎమ్మెల్యే100 కోట్లతో నేనే అభివృద్ధి చేస్తున్న అని గొప్పలు చెప్పుకుంటున్న, ఎమ్మెల్యేకాలేని జడ్పీ చైర్మన్, వర్షం వస్తే రోడ్లన్నీ జలమయం,మెయిన్ రోడ్డులో అదే పరిస్థితి, ఎక్కడ మీరు చేసిన అభివృద్ధి, ప్రతి వార్డులో డ్రైనేజీ సమస్య, ఉంది సైడ్ డ్రైనేజ్ లో పారాలసిన మురుగు నీళ్లు, రోడ్లపై పారుతున్నాయి,ఎక్కడ మీ అభివృద్ధి,మధిర లో నిత్యం అదిచేస్తున్నాం ఇది చేస్తున్నాం అని చెప్పుకునే నాయకులరా!ఇప్పటికైనా ప్రజలు పడుతున్న బాధలను అర్థం చేసుకుని,తీర్చే ప్రయత్నం చేయండి, లేకపోతే ప్రజల తరుపున పోరాటం చేయటాన్నికి బీజేపీ నాయకులు సిద్ధంగా ఉంటారు అని గుర్తుంచుకోండి,

## మండల పరిధిలోవ్యాధుల పట్ల జరభద్రం ఉండాలి



మధిర రూరల్ జూలై 23 ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలందరికీ తెలియజేయు విన్నపమువర్షాల వలన, పారిశుద్ధ్యం లోపించడం వలన, తాగునీరు కలుషితం అవడం వల్ల, వర్షపు నీరు నిలువ ఉండి దోమల ఉత్పత్తి పెరిగి అవి కుట్టడం వల్ల, ఈగలు వాలిన బయటి ఆహార పదార్థాలు కలుషిత ఆహారం తినటం వల్ల చిన్నపిల్లల్లో,పెద్దల్లో జ్వరములు, జలుబు,తలనొప్పి, దగ్గు, ఒళ్ళు నొప్పులు రావచ్చునుమామూలు జ్వరం, జలుబు, తలనొప్పి,దగ్గు వచ్చినాయెడల శుభ్రత పాటిస్తూ, కాచి చల్లార్చిన నీరు తాగుతూ మీ గ్రామంలోని ఆశా కార్యకర్త, ఏఎన్ఎం అడిగి సాధారణ మాత్రలు వేసుకున్న మూడు రోజులు వరకు జ్వరం తగ్గకపోతే, వెంటనే ఈ క్రింది లక్షణాలు ఏమైనా ఉంటే మీ దగ్గరలోని మాటూరు పేట, దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, మధిర ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ హాస్పిటల్ నందు కానీ,హెల్త్ వెల్నెస్ సెంటర్స్ నందు వైద్యులను సంప్రదిస్తే, వారు వెంటనే రక్త పరీక్షల ద్వారా తెలుసుకొని తగిన వైద్యం ప్రారంభిస్తారువైరల్ ఫీవర్ దగ్గు, జలుబు, జ్వరం తలనొప్పి, ఒకేసారి ఎక్కువ మందికి వచ్చే వైరల్ ఫీవర్.నివారణ: బయటి తిరగకుండా రెస్ట్ తీసుకోవడం, కాచి చల్లార్చిన మంచినీళ్లు తాగటం, జలుబు, వాడాలని వైద్యులు తెలిపారు .

## రావినూతల గ్రామంలో సిఎస్ సి వారి వైద్య శిబిరం



బోనకల్ జూలై 23 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని రావినూతల గ్రామంలోని ఆదివారం రైతు వేదిక నందు సిఎస్సి వారి హెల్త్ క్యాంపును సిఐటియు, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ లేబర్ డిపార్ట్మెంట్ వారు ఇచ్చిన లేబర్ గుర్తింపు కార్డు ఉన్నవారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. క్యాంప్ ఇంచార్జ్ జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సోమవారం ఆళ్లపాడు గ్రామంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు ప్రజలలో ఈ వైద్య శిబిరం గురించి అవగాహన కల్పించి క్యాంపు వద్దకు వచ్చే విధంగా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రావినూతల సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్ ,సిపిఎం , సిఐటియు నాయకులు గుగులోతుపంతు, కొంగర గోపి, ఎస్కే అఫ్జల్, లక్ష్మణ్, హెల్త్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

## మణిపూర్ ఘటన పై రాష్ట్రపతి స్పందించాలి



మంచిర్యాల టౌన్ , జూలై 23, ప్రజాపాలన: భారతదేశం లోని మణిపూర్ లో మహిళలని నగ్నంగా ఊరేగించిన సంఘటనపై భారత ప్రథమ పౌరులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ స్పందించాలని అఖిల భారత పద్మశాలి సొసైటీ బెల్లంపల్లి అధికార ప్రతినిధి కొలిపాక శ్రీనివాస్ ఆదివారం అన్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ లో మహిళ హక్కులకు భంగం కలిగించి శాంతి భద్రతల ను గాలి కి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

## మణిపూర్ రాష్ట్ర ప్రజలకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం




మంచిర్యాల టౌన్, జూలై 23, ప్రజాపాలన : మణిపూర్ రాష్ట్ర ప్రజలకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయింది అని సిపిఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గోమస ప్రకాష్ అన్నారు. ఆదివారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలపై దాడికి పాల్పడిన దుండగులను శిక్షించాలని జులై 25వ తేదీన జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంకె రవి దుంపల రంజిత్ కుమార్ కే ప్రేమ్ కుమార్ డి మోహన్ కుమార స్వామి పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగ సందర్భంగా పలు ఆలయాలను సందర్శించిన రాగిడి లక్ష్మారెడ్డి



మేడిపల్లి, జూలై 23 (ప్రజాపాలన ప్రతినిధి) : ఉప్పల్ నియోజకవర్గంలో బోనాల పండుగ సందర్భంగా ఉప్పల్ మరియు చిల్కానగర్ డివిజన్లో పలు ఆలయాలను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి.ఉప్పల్ నల్ల పోచమ్మ ఆలయం, బొప్పన్ కట్ట మైసమ్మ ఆలయం, కావేరి నగర్ పోచమ్మ ఆలయం, సెవెన్ హిల్స్ కాలనీ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం, చిలుకా నగర్ పోచమ్మ ఆలయాలలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలలో రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.అనంతరం ఉప్పల్ నల్లపోచమ్మ కమిటీ సభ్యులు మేకల శివారెడ్డి, సల్ల రాజిరెడ్డి, పోగుల దయాకర్ రెడ్డి, బొప్పన్ కట్ట మైసమ్మ ఆలయం కమిటీ సభ్యులు రమాకాంత్ రెడ్డి, లక్ష్మణ్, ఈగ సంతోష్ బొమ్మల సుధాకర్, కావేరి నగర్ పోచమ్మ ఆలయం కమిటీ సభ్యులు సుధాకర్ రెడ్డి బిక్షపతి, సెవెన్ హిల్స్ కాలనీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్ గుప్తా, చిల్కానగర్ పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు రాములు, రాగిడి లక్ష్మారెడ్డిని ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలోటిపిసిసి మైనార్టీ జనరల్ సెక్రెటరీ సంజయ్ జెన్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు



మంచిర్యాల టౌన్, జూలై 23, ప్రజాపాలన : కాంగ్రెస్ పార్టీ లో భారీ చేరికలు మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు హమాలివాడలోని నల్ల రమేష్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన సుంకరి నరేష్ వీరా చారి గంగారాం సత్యనారాయణ పొషం సునీత రాజారాం మల్లమ్మ విజయ పూజ సతమ్మ వారి అనుచరులు, 7వ వార్డు ఎన్టీఆర్ నగర్ లోని సాయి ఆధ్వర్యంలో ఇప్ప సురేష్ ముర్ర సంతోష్ తోకల నరేష్ సప్ప సంతోష్ వారి అనుచరులు ఆదివారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో వివిధ పార్టీల నాయకులకు ఆయన డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ లు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా కలిసి కట్టుగా ఉండి వచ్చే ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.దేశంలో రాష్ట్రంలో సుపరిపాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తూముల నరేష్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పుదరి తిరుపతి కౌన్సిలర్ ఎస్ సి సెల్ జిల్లా అధ్యక్షులు రామగిరి బానేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీని కలిసిన అరిగెల తిరుమల్ రావు



మంచిర్యాల టౌన్, జూలై 23, ప్రజాపాలన: తెలంగాణ ఎన్నికల కమిటీ సభ్యులు గా ఎన్నికైన మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు ను జిల్లా కేంద్రంలో ని ఆయన నివాసంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరిగెల తిరుమల్ రావు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తూ ప్రజలలో ఉన్న నాయకులకే ముందు అవకాశం ఉంటుందని ప్రజల సమస్యలపై పోరాడి ప్రజలకు అండగా ఉండాలని నాయకులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఎం డి కాలీద్ జావీద్ యువజన కాంగ్రెస్ నాయకులు ఆడేపు రవి రచ్చ నరేష్ సంతోష్ సోహెబ్ సమీర్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కొప్పుల శ్రీధర్ ను సస్పెండ్ చేయాలి: ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్



మంచిర్యాల టౌన్, జూలై 23, ప్రజాపాలన: చెన్నూర్ మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కొప్పుల శ్రీధర్ ను ఆంగ్ల ఉపాధ్యాయుడు లను సస్పెండ్ చేయాలని ఐక్య ఐక్య విద్యార్థి సంఘం నాయకులు అన్నారు. ఆదివారం చెన్నూర్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ చెన్నూర్ మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఆంగ్ల ఉపాధ్యాయుడు ఇద్దరు కలిసి విద్యార్థులను వేధిస్తూ బెదిరిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ రాజకీయాలు చేస్తున్నారు అని అన్నారు. విద్యార్థులకు విద్య బుద్ధులు చెప్పలిసింది పోయి విద్యార్థులను వేధిస్తూ ఇబ్బందులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేయడం సిగ్గు చేటని అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పలు ఆందోళన కార్యక్రమాలు చేస్తాం అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సల్మాన్ టీబీఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిరి రాజేష్ ఎన్ ఎస్ సి జిల్లా అధ్యక్షుడు పురేళ్ల నితీష్ ఎన్ఎస్ యుఐ జిల్లా నాయకులు బి అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్లో ఘనంగా బోనాల ఉత్సవాలు



మేడిపల్లి, జూలై 23 (ప్రజాపాలన ప్రతినిధి) : ఉప్పల్లో బోనాల పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ డివిజన్ ఏషియన్ థియేటర్ ఎదురుగా గల శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల పండుగ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా కార్మికశాఖ మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఉప్పల్ గ్రామ పెద్దలు మేకల శివారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, గ్రామ పెద్దలు పోగుల దయాకర్ రెడ్డి, సల్ల రాజిరెడ్డి, బిక్కుమల్ల అంజయ్య గుప్తా, కుమ్మరి నారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గొల్లూరి అంజయ్య, గంధం నాగేశ్వరరావు, మేకల హనుమంతరెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, వేముల సంతోష్ రెడ్డి, మస్కు సుధాకర్,సత్యపాల్ రెడ్డి, నయా వెంకట్రావు, అన్న వెంకటేష్, వేముల వెంకట్ రెడ్డి ,గుర్రాల వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ జాతికి జరిగిన అవమానాన్ని నిరసిస్తూ బహుజన్ సమాజ్ పార్టీ నిరసన కార్యక్రమం



ప్రజాపాలన ప్రతినిధి షాబాద్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారం చేసిన వ్యక్తులని బహిరంగంగా ఉరి తీయాలి . షాబాద్ మండల్ బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు మల్లీ వెంకటేష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమమ్ ఈ సందర్భంగా మల్లీ వెంకటేష్ మాట్లాడుతూ నెల రోజుల క్రితం మణిపూర్ రాష్ట్రంలో కుకీజాతికి చెందిన ఇద్దరు మహిళలను నగ్నంగా బహిరంగంగా ఊరేగించి వారిపై అత్యాచారం హత్య చేసిన వ్యక్తులని అదే ప్రదేశంలో ఆ ప్రాంతానికి చెందిన ప్రజల మధ్యలోనే బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు మహిళా రక్షణ గురించి ఇంకా ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలని ఈ సంఘటనకు బాధ్యతగా మణిపూర్ రాష్ట్ర హోం శాఖమంత్రి ముఖ్య మంత్రి రాజీనామాలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో ఎన్ని అల్లర్లు హత్యలు అత్యాచారాలు జరుగుతున్న కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బీఎస్పీ చేవెళ్ల నియోజకవర్గం ఉపాధ్యక్షులు శ్రీశైలం కర్రె షాబాద్ మండల బి. ఎస్.పి కమిటీ సభ్యులు. మున్నూరు కాపు శ్రీనివాస్ .ఉపాధ్యక్షులు రవికుమార్. జనరల్ సెక్రెటరీ బి మహేందర్ . సెక్రెటరీ ప్రవీణ్ కుమార్ ట్రెజరర్ టేకులపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామినూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం



మధిర జూలై 23 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నాడు స్థానిక బంజారా కాలనీ శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నూతన పాలకమండలి అధ్యక్షురాలుగా గుర్రం ప్రమీల ప్రమాణ స్వీకారం చేశారు అనంతరం ఆమె మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి దీవెనలతో నూతన పాలకవర్గం కలుపుకుంటూ భక్తులందరూ సహకారంతో అభివృద్ధిలో దేవాలయానికి తీసుకున్నారు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పుర ప్రముఖులు నూతన కమిటీని అభినందించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు రంగా వెంకటేశ్వర్లు, గొండేల ముత్తయ్య, పుతుంబాక కృష్ణ ప్రసాద్, కళ్యాణం పుల్లారావు,నాగిరెడ్డి కరివేద వెంకటేశ్వరరావు, కటకం నరసింహారావు, బాలు నాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ కోట ధర్మాకు మాతృ వియోగం



**పరామర్శించిన బి.ఆర్.ఎస్. నాయకులు మొండితోక సుధాకర్ రావు.**

మధిర జూలై 23 ప్రజాపాలన ప్రతినిధి రూరల్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న కోట ధర్మా తల్లి గారైన కోట జమలమ్మ92 నిన్న ఎర్రుపాలెం మండలం భీమవరంలో అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బి.ఆర్.ఎస్ నాయకులు మొండితోక సుధాకర్ రావు భీమవరం వెళ్లి ధర్మాను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## తెదేపాతోనే మహిళా సాధికారత



నరసాపురం, జూలై 23 (ప్రజాపాలన ప్రతినిధి) :తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాశక్తి కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 4 వ వార్డులో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమగోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి పార్టీ నాయకులతో కలిసి మహాశక్తి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వార్డులో ఇంటింటికి తిరిగి తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో మహిళల కొరకు ప్రకటించిన మహాశక్తి పథకం ద్వారా మహిళలకు చేకూరనున్న లబ్ధిని ప్రజలకు వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, మహిళా సాధికారత సాధించాలన్నా తెదేపాతోనే సాధ్యమని రానున్న ఎన్నికలలో మహిళలందరూ తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, భూపతి బాబ్జి, బర్రె మురళి, ఎండి మౌలాలి, తాడివాడ రమేష్ బాబు, నాట్ర నరేష్ , మోకా కొండ, తిరుమాని వెంకన్న, మహిళా నేతలు బస్వాని నాగమణి, అనీషా బీబీ, బర్రె రామలక్ష్మి, బోరా చిన్నాయమ్మ,, తాడి భువన తదితరులు పాల్గొన్నారు.

## లారీ బోల్తా.. రెండు ఆవులు మృతి..



గోకవరం జూలై 24.ప్రజా పాలన: లారీ ఢీకొని ఆవులు మృతి చెందాయి. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. రాజమహేంద్రవరం నుండి కొబ్బరికాయలు లోడ్ చత్తీస్గడ్ వెళుతున్న లారీ ఆదివారం ఉదయం గోకవరం శివారు వీరలంక పల్లి రహదారి మీద నడుస్తున్న ఆవులు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆవులు రెండు మృతి చెందాయి. అవును ఢీకొన్న లారీ బోల్తా పడిపోయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. మృతి చెందిన ఆవులు వెదురుపాకు చెందిన సేంద్రియ రైతు కొర్రిపల్లి అప్పలస్వామిగా తెలియ వచ్చింది. మృతిచెందిన ఆవులు విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని రైతు అప్పలస్వామి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన లారీ డ్రైవర్ను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిక తరలించారు. సంబంధిత కేసును గోకవరం పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాన్స్ఫర్స్ మరియు ప్రమోషన్స్ చేపట్టాలి





గుంటూరు ప్రజాపాలన ప్రతినిధి: యూనిఫైడ్ సర్వీసు వలన చాలమంది టీచర్లకు కలిగే ఇంబందులను గౌరవనీయులైన కృష్ణా గుంటూరు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డికి గతంలో మాదిరిగా అదే మున్సిపాలిటీ మరియు కార్పొరేషన్ U.L.Bలో ట్రాన్సఫర్స్ మరియు ప్రమోషన్స్ చేపట్టవలసిందిగా కోరటం జరిగింది .అలాగే SGT టీచర్ల,School Asst ,MEO-2,సమస్యల గురించి చర్చించాము. DPRTU రాష్ట్రఅధ్యక్షులు D.శ్రీను అన్న గారు చేతులమీదగా రిప్రెజెంటేషన్ ఇవ్వటం జరిగింది. జువ్వా జ్ఞానేశ్వర్ రావు అధ్యక్షులు , బందనాదం కుమార్ రాజు కార్యదర్శి డెమోక్రటిక్ PRTU గుంటూరు జిల్లావారు పాల్గొన్నారు.

## తాళ్ళపల్లిగుడా అఖిల భారత యాదవ మహాసభ గ్రామ కమిటి ఎన్నిక



ఇబ్రహింపట్నం జులై తేది 23 ప్రజాపాలన ప్రతినిధి :మంచాల మండల పరిధిలోని మండల అధ్యక్ష కార్యదర్శులు గజ్జి ఐలయ్య యాదవ్ వట్టి యాదయ్యా యాదవ్ మరియు యూత్ అధ్యక్ష కార్యదర్శులు రాజేష్ యాదవ్, మధు యాదవ్ గార్ల అధ్వర్యంలో తాళ్ళపల్లిగుడా గ్రామ యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షుడు ఐలయ్య మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి యాదవులు రాజకీయంగా ఎదగాలని ఆర్థికంగా ముందుండాలని కోరారు.అధ్యక్షులుగా పాక జంగయ్య యాదవ్,పోలమోని శ్రీశైలం,యూత్ అధ్యక్షులుగా కస శ్రీశైలం,పాక కృష్ణ. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెనిగే వెంకటేష్ యాదవ్,పోచమోని కృష్ణ యాదవ్,వట్టి జంగయ్య, బోయినీ నర్సింహ,బూరుగు ఐలయ్య,కసరమోని శ్రీశైలం యాదవ్, కసరమోని మహేందర్ యాదవ్,సురేష్,శ్రీశైలం, బైకాని మహేందర్,ఆవుల శ్రీను,పెద్ద మల్లేష్,ఆవుల ప్రశాంత్,సురిగాల్ల మల్లేష్ మరియు సంఘం సభ్యులంతా పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలి

**జిల్లా యువజన విభాగ అధ్యక్షులు చింత నిప్పు కృష్ణ చైతన్య**



బోనకల్, జూలై 23 ప్రజా పాలన ప్రతినిధి: జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ఆదేశాల మేరకు మండల యువజన విభాగ అధ్యక్షులు షేక్ నజీర్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల యువజన అధ్యక్ష కార్యదర్శులు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను యువజన విభాగం నాయకులు నియోజకవర్గంలోని ప్రతి గడ పకు తీసుకెళ్లి ప్రతిపక్షాల అసత్య ప్రచారాలు తిప్పి కొట్టాలని జిల్లా యువజన విభాగ అధ్యక్షులు చింతనిప్పు కృష్ణ చైతన్య అన్నారు. గురువారం జరిగిన మండల బీఆర్ఎస్ యువజన విభాగం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా జిల్లా అభివృద్ధిలో మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. మధిర నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకెళ్తుందని, నేటి యువత బీఆర్ఎస్ వైపు చూస్తున్నదన్నారు. ఎన్నికల సమయం వస్తున్న తరుణంలో మాయమాటలతో ప్రతిపక్షాలు బయల్దేరాయని, కల్ల బొల్లి మాటలతో మోసం చేయాలని చూస్తున్నారని, మాయ మాటలు నమ్మి మోస పోవద్దని సూచించారు. యువజన విభాగం మధిర నియోజకవర్గ అధ్యక్షులు కూన నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణలో ఎన్నికల సమయం దగ్గర పడేకొద్ది ప్రజల్లో లేనివాళ్లు..ఎన్నికలంటే వచ్చేవాళ్లు ఇప్పుడు వస్తున్నారని,రాజకీయం అందరూ చేస్కోవచ్చు కానీ గత పదేండ్లుగా కన్పించని వాళ్లు..ప్రజలకు దూరంగా ఉన్నవాళ్లు ఇప్పుడు వచ్చి అసత్య ప్రచారాలకు దిగుతున్నారని,ఈ ప్రచారం సోషల్ మీడియా వేదికగా విసృతంగా జరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రచారాన్ని తిప్పుకొట్టా లన్నారు. సోషల్ మీడియా వారియర్స్ అందరూ నిత్యం బీఆర్ఎస్ పార్టీ,సీఎం కేసీఆర్ ,మంత్రి కేటీఆర్ అధికారక సోషల్ మీడియా ఖాతాలతో పాటు, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు యొక్క సోషల్ మీడియా ఖాతాలను అనుసరించాలని, నిత్యం ప్రజల్లోకి వాటిని తీసుకెళ్లాలని,పదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం, లింగాల కమల్ రాజు జేసిన అభివృద్ధి పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. అనంతరం మండల యువజన విభాగ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల యువజన విభాగ కార్యదర్శిగా గుడిదే శ్రీరాం గౌడ్, ప్రచార కార్యదర్శిగా రామడుగు నరేష్, సంయుక్త కార్యదర్శిగా షేక్ యూసఫ్, ఉపాధ్యక్షులుగా నిమ్మ తోట రవి లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనింపు కృష్ణ చైతన్య, మధిర నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు కూన నరేందర్ రెడ్డి, బోనకల్ మండల అధ్యక్షులు షేక్ నజీర్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు మూడవత్ సైదా పాల్గొన్నారు.

## కల్వర్టు పగిలిపోయి పొంచి ఉన్న ప్రమాదం





బోనకల్, జూలై 23 ప్రజా పాలన ప్రతినిధి: కల్వర్టు పగిలిపోయి ప్రమాదం పొంచి ఉన్నది. స్థానికులకు ఇబ్బందిగా మారింది. నిత్యం వందలాదిమంది ప్రయాణించే రోడ్డు పక్కన కల్వర్టు పగిలి ప్రమాదం పొంచి ఉన్న అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదని స్థానికులు అంటున్నారు. వర్షాకాల సమయం కావున మురికి నీటి వాసనతో దోమల బెడదతో స్థానికులు రోగాలకు గురవుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని గిరిజన కాలనీవాసులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని ఎస్టి కాలనీ లో శబరి వైన్స్ కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన కల్వర్టు పగిలి ఉన్నది. రాత్రిపూట ఆంధ్రా నుండి అక్రమ ఇసుక రవాణా చేస్తు అధిక బరువులతో కూడిన లారీ తో సుమారు 60 టన్నుల ఓవర్ లోడ్ లారీని ఈ కల్వర్టు పైకి ఎక్కియడంతో పగిలిపోయి లారీ కింద పడి పోయింది. రాత్రిపూట లారీ కింద పడిపోయే సమయంలో పక్కన ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తెల్లవారే సరికి స్థానికులు లేచి చూడడంతో కల్వర్టు పగిలిపోయి లారీ కింద పడిపోయి ఉన్నది. కల్వర్టు పగిలిపోవడంతో స్థానికులు వారిని అడగగా మేము చేపిస్తాము అని స్థానిక గిరిజన కాలనీ వాసులకు చెప్పారు. కానీ నాలుగు ఐదు నెలలు అవుతున్న ఇంతవరకు పట్టించుకోకపోవడంతో వర్షాకాలపు మురికి నీటి వాసనతో ఎస్టీ కాలనీ వాసులు రోగాలకు గురవుతున్నారు. అధికారులు ఇంతవరకు చూడకపోవడంతో స్థానిక ఎస్టీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు ఆటలు ఆడుకుంటూ ఆదమరిచి పగిలిపోయి ఉన్న కల్వర్టులో పడిపోయారంటే చెప్పుకోలేని ప్రమాదం జరగవచ్చునని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. రాత్రిపూట కరెంటు లేని సమయంలో అటు నుండి వస్తున్న వాహనదారులు ఆదమరిచి ప్రయాణించారో ప్రమాదం భారిన పడ్డట్లే. కూలిన కల్వర్టు కింద భాగంలో ప్రమాదకరమైన పెద్ద పెద్ద రాళ్లు ఇనుప సువ్వలు ఉన్నాయి. ప్రమాదవశాత్తు వాహనాలు కల్వర్టు లో పడిపోతే అంతే సంగతి . ఇప్పటికైన పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించి సత్వరమే కల్వర్టు నిర్మాణం చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక గిరిజన కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం చేయాలంటే వాహన దారులు భయపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ కల్వర్టుకు మరమ్మత్తులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యా ముఖచిత్రాన్నే మార్చివేసిన గొప్ప విద్య తాత్వికుడు సరస్వతీ పుత్రుడు డాక్టర్ బి.యస్.రావు : జోనల్ అకడమిక్ కో ఆర్డినేటర్ శ్రీ కృష్ణారావు



మధిర రూరల్ జూలై 23 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నాడు అమరవీరుల స్తూపం వద్ద శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బి.యస్.రావు కి ఘన నివాళి అర్పించిన శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంముఖ్యఅతిథిగా హాజరైన మధిర,ఖమ్మం జోనల్ అకడమిక్ కో ఆర్డినేటర్ శ్రీ కృష్ణారావు జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాల తో ఘన నివాళు లర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తను ఒక డాక్టర్ కానీ.. తెలుగు గడ్డ పై సరికొత్త చరిత్ర సృష్టించి ఆంధ్రప్రదేశ్ విద్యా ముఖచిత్రాన్నే మార్చివేసిన గొప్ప విద్య తత్వికుడు సరస్వతీ పుత్రుడు శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బి.యస్.రావు గారు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ విద్యాసంస్థలు శ్రీ చైతన్య విద్యాసంస్థలు 1986లో విజయవాడలో 56 మంది బాలికలతో జూనియర్ కళాశాల స్థాపనతో ప్రారంభించబడింది. ఈ సంస్థ స్థాపకులు, మార్గనిర్దేశకులు అయిన డాక్టర్ బి.యస్.రావు , డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి వృత్తిరీత్యా వైద్యులు . విద్యా వ్యవస్థను నెలకొల్పిన అనతి కాలంలోనే ఇంటర్మీడియట్ విద్యకు ఒక సరికొత్త ఒరవడి సృష్టించారు. వీరుచేపట్టిన ప్రణాళికా బద్ధమైన విధానం ఆంధ్రప్రదేశ్ విద్యా ముఖచిత్రాన్నే మార్చివేసింది.బోధనలోనూ, సిబ్బంది నిర్వహణలోనూ మరింత మెరుగైన విధానాన్ని ప్రవేశ పెట్టడంతో రాష్ట్రంలోని ప్రీ యూనివర్సిటీ స్థాయి విద్యలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది.శ్రీ చైతన్య విద్యాసంస్థలు ఆంధ్రప్రదేశ సరిహద్దులు దాటి విస్తరించటం అనేది 2004 నుంచి ఆరంభమైంది. ఢిల్లీ, హిమాచల్ప్రదేశ్, కర్నాటకలలో దీని బ్రాంచ్లు ఏర్పడ్డాయి. 2006 నుంచి ఐఐటి-జెఇఇ, ఎఐఇఇఇ, పిఎంటి కోచింగ్ సెంటర్లు హిమాచల్ప్రదేశ్, చండీగఢ్, జార?ండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఏర్పాటుచేశారు. డాక్టర్ బి.ఎస్ రావు ఆశయ సాధన కట్టుబడి విశేష కృషి ఇస్తామని ప్రిన్సిపాల్ ఎ.భారతి, డీన్ శ్రీ.శ్రీ.నరేష్, సి-ఇంఛార్జి శ్రీ.కె.తిరుపతిరావు, మరియు టీచింగ్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్.ప్రతిజ్ఞ చేశారుఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల మధిర.ఖమ్మంజోనల్ అకడమిక్ కో ఆర్డినేటర్ శ్రీ.కృష్ణారావు, కొత్తగూడెం జోనల్ అకడమిక్ కో ఆర్డినేటర్ శ్రీ.వెంకట్, ప్రిన్సిపాల్ ఎ.భారతి, డీన్ శ్రీ.శ్రీ.నరేష్, సి-ఇంఛార్జి శ్రీ.కె.తిరుపతిరావు, మరియు టీచింగ్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు

## సీపీఎం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం





ఇబ్రహింపట్నం జూలై తేది 23 ప్రజాపాలన ప్రతినిధి: మణిపూర్ లో ఆదివాసీ గిరిజన మహిళను నగ్నంగా ఊరేగించి లైంగికంగా వేధించి, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఇబ్రహీం పట్నం పొల్క%శీ%పల్లి లో సీపీఎం, డి వై ఎఫ్ ఐ అర్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు మాట్లాడుతూ సర్వ సమాజం తలదించుకునే విదంగా మణిపూర్ రాష్ట్రంలో సంఘటన ఉంది. బిజెపి అధికారంలో వున్న రాష్ట్రంలో ఇంత దారుణంగా చేయటం, అక్కడ వున్న ముఖ్యమంత్రి ఎలాంటి చర్యలూ తీసుకోక పోవటం దురదృష్టకరం.కేంద్రం లో వున్న మోడి నోరు మేదప క పోవడం సర్వ సభ్య ఖండించాలని అన్నారు.మణిపూర్ లో జరిగి నెలలు గడిచినా అక్కడ ప్రభుత్వము దుండగులకు రక్షణ కల్పిస్తుంది, బయటకు రాకుండా ప్రభుత్వమే కాపాడింది.అక్కడ జరిగిన దారుణ సంఘటన కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతా వహించి రాజీనామా చేయాలని, ఇంత దారుణానికి ఒడిగట్టిన దుండగులను ఊరి తియలని, భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలకు తీసుకోవాలి డిమాండ్ చేశారు కార్యక్రమంలో చెరుకూరి నరసింహ, పంది జగన్, గూడెం అశోక్, ఆమనగంటి నరసింహ, కంబాలపల్లి వెంకటేష్, ఎండి ఉస్మాన్, , గూడెం నరసింహ, పంది ధనేశ్వర్, పంది యాదయ్య, కంబాలపల్లి వెంకటేష్, ఏదుల్ల పాండు, వర్కాల శివ, ఆమనిగంటి బాలరాజ్, కంబాలపల్లి బాలరాజ్, దోర్నాల శివకుమార్, కట్టెల నరసింహ, పూల యాదయ్య, గూడెం దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న మల్రెడ్డి నిరంజన్ రెడ్డి





ఇబ్రహింపట్నం జూలై తేది 23 ప్రజాపాలన ప్రతినిధి :ఆదివారం రోజున ఇబ్రహింపట్నం నియోజకవర్గం ఆదిభట్ల లో తొట్టెల ఊరేగింపు కార్యక్రమం మరియు పోచమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు ఇబ్రహింపట్నం నియోజకవర్గం నాయకులు మల్రెడ్డి నిరంజన్ రెడ్డి , ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ దేవ తల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడిపంటలతో, అష్టైశ్వర్యాలతో, సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు వివిధ పార్టీల నాయకులు పల్లె గోపాల్ గౌడ్, కోరే జంగయ్య, దర్శన్ గౌడ్, రఘువీర్ గౌడ్, పాండురంగారెడ్డి, గోపాల్ గౌడ్, రజనీకాంత్ గౌడ్, సాయిబాబా గౌడ్, కోర జంగయ్య, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్,సింగర్ శివ మరియు గ్రామ ప్రజలు, యువకులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## బలవంతాన ఫోటోలు దింపుకొని పై అధికారులకు పనులు చేసినట్లు పంపుకోడం సిగ్గుచేటు



ఇబ్రహింపట్నం జులై తేది 23ప్రజాపాలన ప్రతినిధి :రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మంచాల మండల కేంద్రంలో 18 వ రోజు కొనసాగింది. సమ్మె పట్ల ప్రభుత్వ మొండి వైఖరికి నిశనగ మెడకు ఉరితాల్లు వేసుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ గ్యర పాండు,సి ఐ టీ యు మండల కన్వీనర్ పోచమోని కృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో కార్మికులు పనులు చేయకపోయినా బలవంతాన ఫోటోలు దింపుకొని పై అధికారులకు పనులు చేసినట్లు పంపుకోడం సిగ్గుసేటనీ విమర్శించారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న కార్మికులు సమ్మెలో ఉంటే కొన్ని గ్రామాల్లో కార్మికుల చేత పనులు చేసిన పాత పోటోలు పై అధికారులకు పంపించుకుంటున్నారు. సమ్మెలో ఉన్న కార్మికుల చేత పనులు చేయకపోయినా పనులు చేసినట్లు పోటోలు తీసుకొని పంపుకోవడం ఏమిటని ప్రశ్నించారు. చెత్త పేర్లు వెరుకునే వారి దగ్గరకు వెళ్లి పోటోలు దిగి జీ పి కార్మికులుగా చుపించుకోవడం సిగ్గుచేటని అన్నారు .కొంత మంది పంచాయతీ కార్యదర్శులు ప్రమోసన్ల కోసం కార్మికులను బలవంతం చేయడం ఏమిటని ప్రశ్నించారు.అధికారులు ఇలాంటి సిగ్గుమాలిన పనులను మానుకోవాలని సూచించారు. పై అధికారుల మెప్పుకోసం పోటోలు పంపించినంత మాత్రాన కార్మికులు చేస్తున్న సమ్మె ను ఆపలేరని అన్నారు.అధికారులు ప్రజాప్రతినిధులు ఎన్ని రకాలుగా విచ్ఛిన్నం చేయాలనుకున్న సమ్మెను కొనసాగించి తీరుతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఖాజా పాషా భాస్కర్, నాయకులు శంకరయ్య, రవి, సురేష్, యాదయ్య, అర్జున్, నర్సింహా, వెంకటయ్య,అంజయ్య, పాండు, బీరప్ప, రోషమ్మ,చంద్రమ్మ,గంగమ్మ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశం మహోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరైన డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి





గుంటూరు జిల్లా .గుంటూరు .జూలై 23 (ప్రజాపాలన ప్రతినిధి): గుంటూరులోని మంగల్ దాస్ నగర్ నందు సిమ్స్ విద్యా సంస్థల అధినేత భరత్ రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి పలువురు ప్రజా ప్రతినిధులు మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి గౌరవ శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు అనంతరం సిమ్స్ విద్యా సంస్థల అధినేత భరత్ రెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వెంట వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 25న జరిగే విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి: ఏఐఎస్ఏ రాష్ట ఉపాధ్యక్షుడు ఉన్నం అనీల్



నూజివీడు, జూలై 23, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా నెలకొని ఉన్న విద్యార్థులను సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఏ, టిఎన్ఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 25 తేదీన జరుగుతున్న బంద్ ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు తట్టుకోల శివ లు కోరారు. ఈ సందర్భంగా నూజివీడు టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులను విద్యకు దూరమయ్యే చర్యలు చేపడుతుందని అందులో భాగంగానే విద్యార్థులకు ఒక్కొక్కటిగా దూరం చేస్తూ విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు విద్యను దూరం చేస్తుందని, అదేవిధంగా నాలుగు సంవత్సరాల డిగ్రీ విధానంలో సింగిల్ మేజర్ సబ్జెక్టు తీసుకొచ్చి డిగ్రీ విద్యా విధానాన్ని నాశనం చేస్తున్నారని తక్షణమే నాలుగు సంవత్సరాల డిగ్రీ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా పెరిగిన ధరల ప్రకారం మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, ప్రభుత్వ పాఠశాల విలీనం రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. కామన్ పీజీ సెట్ రద్దు చేయాలని కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టి విద్య హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలుపరచాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని ఈ డిమాండ్ల సాధనకై జరుగుతున్న జూలై 25 వ తేదీన జరుగు బంద్ ను ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలన్నీ స్వచ్ఛందంగా సంపూర్ణంగా మద్దతు తెలియజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ నూజివీడు పట్టణ అధ్యక్షులు శ్రీను, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు గారపాటి ధనుంజయ్, సురేష్, కిషోర్, అచ్యుత్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## పల్లగాని అన్నప్రాసన కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ మాదు



ఆగిరిపల్లి , జులై 23, ప్రజాపాలన (ప్రతినిధి): మండల పరిధి చిన్నగిరిపల్లిలో ఆదివారం ఆగిరిపల్లిమండల వైయస్సార్సీపి పార్టీ అధ్యక్షులు పల్లగాని నరసింహరావు మనవడి అన్నప్రాసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గౌడ కార్పొరేషన్ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ పరిశీలకులు,ఎన్టీఆర్-కృష్ణ-గుంటూరు జిల్లాల ప్రచార విభాగం జోనల్ ఇంచార్జి మాదు శివరామకృష్ణ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలగాని వారి దేవతను దర్శించుకుకొని, వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు నిర్వహించడం జరిగింది, అనంతరం చిన్నఆగిరిపల్లి గ్రామంపెద్దలతో మరియు వైఎస్ఆర్సిపి నాయకులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఎంపీపీ అనాగని రవి , గ్రామ సర్పంచ్ పలగాని జమదగ్ని , ఆగిరిపల్లి మండలం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వాకా సక్కేశ్వరరావు , పరస రవి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు జగన్ తగిన గౌరవం కల్పించారు

**బంటుమిల్లి బస్ స్టేషన్ ను త్వరలో ఆధునికరిస్తాం ..**
**నూతన పెట్రోల్ డీజిల్ బంకు ప్రారంభోత్సవంలో మంత్రి జోగి రమేష్**



బంటుమిల్లి, జులై 23: ప్రజాపాలన :అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఏపీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులు, కార్మికులకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తగిన గౌరవం కల్పించారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. బంటుమిల్లి బస్ స్టేషన్ పక్కనే గల సువిశాలమైన ప్రాంతంలో ఏపీఎస్ఆర్టీసీ వారి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన హిందుస్థాన్ పెట్రోలియం లిమిటెడ్ వారి పెట్రోల్ డీజిల్ బంకును శనివారం మంత్రి ప్రారంభించారు. బంకు ఏర్పాటుకు కృషిచేసిన ప్రతి ఒక్కరినీ మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ డీజిల్ బంకు ఆర్టీసీ సంస్థ మనుగడకు ఎంతో తోడ్పాటును అందిస్తుందని అన్నారు. కల్తీ లేని నాణ్యమైన పెట్రోల్ డీజిల్ అందించడంలో వినియోగదారుల విశ్వాసనీయతను పెంపొందించుకోవాలని ఆశించారు. త్వరలో సీఎన్ జీ గ్యాస్ బంకును సైతం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రికి నిర్వాహకులు తెలిపారు. తాను ఆర్టీసీ జోనల్ చైర్మన్ గా ఉన్న రోజుల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మనుగడ లేని ఆర్టీసీ సంస్థకు జీవం పోశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ పాలకులు ఆర్టీసీని ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేశారని, అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఏపీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి తగిన గౌరవం కల్పించారని పేర్కొన్నారు. వివిధ జిల్లాలు, మండలాలకు ప్రయాణికుల రాకపోకలలో ముఖ్య కేంద్రమైన బంటుమిల్లి బస్ స్టేషన్ ను అన్ని సౌకర్యాలతో త్వరలో ఆధునీకరించనున్నామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోన్-2 కె గోపినాథ్ రెడ్డి, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ రీజినల్ ఆఫీసర్ ఆదిత్య ఆనంద్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రెబ్బా అంబేద్కర్, జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఏ.వాణిశ్రీ, ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్, మచిలీపట్నం డిపో మేనేజర్ పి.పెద్దిరాజు, బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చినబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు, పాల్గొన్నారు.

## మహాశక్తి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర..!



మచిలీపట్నం, టౌన్ జులై 23: ప్రజాపాలన : ఏలూరు కలెక్టర్ ను బ్లాక్ మెయిల్ చేయడం ఎంతవరకు సమంజసమని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మీడియా సమావేశంలో ప్రశ్నించారు. ఆదివారం అందరు నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొల్లు రవీంద్ర మాట్లాడుతూ , మాజీ మంత్రి బందరు శాసనసభ్యులు పేర్ని నాని ఏలూరు కలెక్టర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసంగా లేదన్నారు. నిషేధిత భూముల్లో యదేచ్ఛగా అక్రమ తవ్వకాలని, అడ్డుకున్న కలెక్టర్ ని జడ్పీ మీటింగ్ ద్వారా బ్లాక్ మెయిల్ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కలెక్టర్ మీద మీరు ఫిర్యాదు చేస్తున్నారు, బాగుంది కానీ, ప్రజలు మీ మీద చేస్తున్న ఫిర్యాదులు గమనించారా? అని పేర్ని నానిని , రవీంద్ర ఘాటుగా ప్రశ్నించారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో బందరు నియోజకవర్గంలో మాజీమంత్రి, బందరు శాసనసభ్యులు, పేర్ని నాని ఎన్నిసార్లు పర్యటించారని, ఎన్ని సమస్యలను పరిష్కరించారో తెలియజేయాలన్నారు. ఎంత సేపు పవన్ కళ్యాణ్ ని ,లోకేష్ ని , చంద్రబాబు ని , తిట్టడం తప్ప బందరు ప్రజలకు మీరు చేసింది ఏమిటి? అని రవీంద్ర ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో తాము మొదలుపెట్టి మంజూరు చేసిన పనులు ఇంతవరకు ఎందుకు పూర్తి కాలేదని రవీంద్ర ప్రశ్నించారు. జిల్లా మంత్రి రోజా రెడ్డి పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నా కనీసం బందరు బీచ్ కి అభివృద్ధినిధులు తెచ్చుకో లేకపోయారన్నారు. రాజ్యాంగేతర శక్తుల్ని ప్రోత్సహించడం సమంజసమా అని అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జ్యువెలరీ పార్కులో కళ్యాణమండపం, చిన్నాపురం మంచినీటి పైపులైన్ కోసం 11 కోట్ల నిధులు మంజూరు చేసామన్నారు. మంచినీటి శుద్ధి కోసం ప్లాంటు, మున్సిపల్ ఆఫీస్ అభివృద్ధి, ఉల్లిపాలెం బ్రిడ్జి, మంచినీటి ట్యాంకు, ఇలా బందరు అభివృద్ధి కోసం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడితే, నాని గారు వచ్చి ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని నానిని ప్రశ్నించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి ఇంటిముందు ఎందుకు ధర్నా చేయలేకపోయారని అన్నారు. జడ్పీ మీటింగ్ కు కలెక్టర్ రాలేదని ఆగ్రహం వ్యక్తం చేయడం ఎంతవరకు భావ్యమని ప్రశ్నించారు. మా వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని సరైన సమయంలో బయటపెడతామని, ఈ విషయాలు గుర్తుంచుకోవాలని రవీంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, టిడిపి కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, దేవరపల్లి అనిత, ఆనంద్, రాము, గోర్రెపాటి గోపీచంద్, ఇలియాన్ పాష, వెంకన్న, పంచపర్వాల కాశీ విశ్వనాథం, లంకెశెట్టి నీరజ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు మహిళల ఆధ్వర్యంలో మహిళా శక్తి కార్యక్రమం



పల్నాడు జిల్లా .నరసరావుపేట. జూలై 23( ప్రజా పాలన ప్రతినిధి ,): నరసరావుపేట మండలం రావిపాడు గ్రామంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో మహా శక్తి కార్యక్రమం నిర్వహించారు. మహా శక్తి వాహనంలో ప్రచారంతో తెలుగు మహిళలు మ్యానిఫెస్టో ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు మాట్లాడుతూ.......మహిళా సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యమని అన్న నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తిలో సమాన వాటాహక్కు కల్పించారన్నారు. చంద్రబాబు నాయుడు మహిళలు ఆర్థికంగా బలపడి ఎవరి మీద ఆధారపడకుండా స్వతహాగా బతకడానికి డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి రుణాల ద్వారా ఆర్థిక చేతనందించారన్నారు. మహిళా సంక్షేమం తెలుగుదేశం పార్టీతోని సాధ్యమని తెలుగు మహిళలు గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమానికి అమలు చేసే కార్యక్రమాలను వివరించుకుంటూ ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమానికి పెద్దన్నల చంద్రన్న పెద్దపీట వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి ఉదయ్ శ్రీ,కదం నాగజ్యోతి,కోసురి రాధిక, నాగలక్ష్మి,రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు పూదోట సునీల్,గ్రామ పార్టీ అధ్యక్షుడు ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.



## మణిపూర్‌లో జరుగుతున్న దాడులపై పలు సంఘాలతో 24న రౌండ్ టేబుల్ సమావేశం



గుడివాడ : మణిపూర్ లో జరుగుతున్న ట్రైబల్ మైనారిటీల మీద దాడులను ఖండిస్తూ 24వ తేదిన పలు సంఘలతో రౌడ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తునట్లు దళిత ఐక్యవేదిక నాయకుడు పొంగులేటి జయరాజు తెలిపారు. ఆదివారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని ఐక్యవేదిక కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 10గం॥ల 30 ని॥లకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంలో టీడీపీ, సిపిఐ, సిపియం, జనసేన, దళిత ఎస్‌సిలు క్రిస్టియన్, బీసీ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సభకు ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని దళిత ఐక్యవేదిక నాయకులు దారం కరుణాకర్, కంచర్ల సుధాకర్, దారం ఉపేంద్ర, మరియబాబు, పాల్, శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు.

## మణిపూర్ ఘటనకు బీరెన్సింగ్, అమిత్ షా రాజీనామా చేయాలి



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి.: జక్కంపూడి రాజు డిమాండ్! మణిపూర్ రాష్ట్రంలో కుకీ తెగలకు చెందిన గిరిజన మహిళలను పరమపాసవికంగా అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటనకు నైతిక బాధ్యత వహించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని గిరిజన నాయకులు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ కాకినాడజిల్లా కమిటీ సభ్యులు జక్కంపూడి రాజు డిమాండ్ చేశారు. డబల్ ఇంజన్ సర్కార్ నడుపుతున్న కేంద్రంలో రాష్ట్రంలోఅధి కారంలో ఉన్న బిజెపి మణిపూర్లో పెట్టిన రిజర్వేషన్లు చిచ్చు వల్ల 140 మందికి పైగా కుకీ గిరిజనులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని ఈరోజు వరకు మణిపూర్ సందర్శించకపోవడం బాధ్యతా రాహిత్యం కాదాఅని ప్రశ్నించారు. ఆటోమొబైల్ షాపులో పనిచేస్తున్న మరో ఇద్దరు మహిళలను అత్యాచారం చేసి హత్య చేయటం సభ్య సమాజం సిగ్గుపడే విధంగా ఉందన్నారు. తక్షణం దోషులందరినీ అరెస్ట్ చేయాలని, మణిపూర్లో శాంతిభద్రతలను ముఖ్యంగా కుకీ గిరిజనులకు రక్షణ కల్పించాలని రాజు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగులాపల్లి అచ్చారావు, రమణ రొబ్బల సంకురమ్మ ఇమ్మిడి లక్ష్మి గుమ్మడి నూక రత్నం తదితరులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి లో ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

శంకరపట్నం జూలై 23 ప్రజాపాలన రిపోర్టర్:శంకరపట్నం మండలం మెట్పల్లికి చెందిన ముంజ రమేష్ (28) అనే యువకుడు ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి వద్ద గల రేకుల షెడ్డులో ఉరి వేసుకున్న రమేష్ కొన ఊపిరితో ఉండగా వారి తల్లిదండ్రులు ఉరి వేసుకున్న తాడును తెంపి ఆసుపత్రికి తీసుకువెళ్లే లోపే మృతి చెందినట్టు మృతుడి తండ్రి కనకయ్య తెలియజేశారు. మానసిక కుంగుబాటుకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మృతుడి తండ్రి పేర్కొన్నారు.

## పద్మశాలి సంఘ బలోపేతానికి నా వంతు కృషి

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సురేష్ చారి, జూలై 23) :పద్మశాలి సంఘం బలోపేతానికి అందరి సహాయ సహకారాలతో కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవనంలో నూతనంగా పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ను ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని మండలాల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారుల నిర్ణయం మేరకు నిర్ణయించిన జిల్లా ఎన్నికలలో పాల్గొన్న తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా గడదాసు మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. పద్మశాలీల చైతన్యం కోసం తమ వంతుగా శయ శక్తుల కృషి చేస్తామని తెలిపారు. త్వరలోనే జిల్లా కార్యవర్గను ఏర్పాటు చేసుకొని మండలాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను శాలువాలు, పూలమాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కమిటీ నిర్వాహకులు హనుమాన్ల శ్రీకాంత్, వడ్నాల వెంకన్న, గాజర్ల శైలేందర్, దాసరి తిరుపతి, సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, చిప్ప సురేష్ (జర్నలిస్ట్) కనకయ్య ,గుండా శంకర్, చంద్రయ్య, లింగయ్య, సత్యనారాయణ, సదానందం, అల్లే శ్రీకాంత్, చందు, జంజరాల సంజీవ్, సత్యనారాయణ, దుబ్బ సత్యనారాయణ, రాంపల్లి విజయ, మంగ, సునీత, గడదాసు రోజా, రుచిత ,జంజరాల శోభ, ప్రవీణ్, హనుమన్ల శంకర్, వనమల ధర్మయ్య, వనం మధుకర్, రోహిదాస్, రమేష్ ,ఇరుకుల్ల ప్రసాద్, తేలి మోహన్, జంజరాల శ్రీనివాస్, అనుమల రవీందర్, పసుపు నూరి రవి, గుండేటి వీరస్వామి, పొన్న రామచందర్, వెంకటేష్, తిరుపతి,నారాయణ, పవన్, గడదాస్ కుమార్, భద్రయ్య, శ్రీకాంత్, బంక వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఓటిటిలో "ఇండియన్ 2" కి భారీ ఆఫర్ తో ప్రముఖ సంస్థ?




లోకనాయకుడు కమల్ హాసన్ హీరోగా కాజల్ అగర్వాల్ అలాగే రకుల్ ప్రీత్ సింగ్ లాంటి స్టార్ హీరోయిన్స్ తో మావెరిక్ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న మాసివ్ పాలన్ ఇండియా చిత్రం "ఇండియన్ 2". మరి తమ కాంబినేషన్ లో వచ్చిన బిగ్గెస్ట్ హిట్ చిత్రం ఇండియన్ కి సీక్వెల్ గా చాలా ఏళ్ల తర్వాత చేస్తున్న ఈ చిత్రంపై ఇప్పుడు అనేక అంచనాలు నెలకొన్నాయి.అయితే ఇప్పుడు ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కంప్లీట్ అవుతుండగా ఈ సినిమా ఓటిటి డీల్ కి సంబంధించి ఓ సాలిడ్ అప్డేట్ ఇపుడు తెలుస్తుంది. దీనితో ఈ చిత్రానికి అయితే దిగ్గజ ఓటిటి సంస్థ నెట్ ఫ్లిక్స్ వారు రికార్డు మొత్తం ఆఫర్ ని ముందు ఉంచినట్టుగా తెలుస్తుంది. దీనితో ఈ చిత్రానికి ఏకంగా 200 కోట్లకి పైగానే ఓ మాసివ్ డీల్ ని నెట్ ఫ్లిక్స్ వారు ముందు ఉంచినట్టుగా తెలుస్తుంది. ఒకవేళ ఇది లాక్ అయితే ఇండియన్ సినిమా దగ్గరే ఓ బిగ్గెస్ట్ డీల్స్ లో ఒకటి అని చెప్పాలి. మరి దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది.

# ప్రారంభమైన మోహన్‌లాల్ "వృషభ" చిత్రం



.మాలీవుడ్ స్టార్ హీరో మోహన్‌లాల్ యొక్క పాన్ ఇండియన్ ప్రాజెక్ట్ వృషభ చిత్రం పై గట్టి హైప్ ఉంది. టాలీవుడ్ యంగ్ హీరో రోషన్ మేక ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వృషభ చిత్రాన్ని మలయాళం మరియు తెలుగులో చిత్రీకరించీ, తరువాత హిందీ, తమిళం మరియు కన్నడ భాషలలో డబ్ చేయనున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇప్పుడు మొదలైంది. ఇదే విషయాన్ని మోహన్‌లాల్ తన ట్విట్టర్ ద్వారా వెల్లడించారు.ఈ సందర్భంగా అందరి ఆశీస్సులు ఆయన కోరారు. రోషన్ సరసన కథానాయికగా సంజయ్ కపూర్ కుమార్తె షానయ కపూర్ ఎంపికైంది. పాప్ సింగర్ జహ్రా ఎస్ ఖాన్, సిమ్రాన్, గరుడ రామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. వృషభ చిత్రానికి నంద కిషోర్ దర్శకత్వం వహించనున్నారు. అభిషేక్ వ్యాస్, విశాల్ గుర్నాని, జుహీ పరేఖ్ మెహతా, శోబా కపూర్, ఏక్తా కపూర్, వరుణ్ మాథుర్, మరియు శ్యామ్ సుందర్ ఈ యాక్షన్ ఎంటర్టైనర్‌కి నిర్మాతలు గా వ్యవహరిస్తున్నారు.

# విశ్వక్ మరో క్రేజీ కాంబో.. గేట్ రెడీ!




యంగ్ హీరో విశ్వక్ సేన్ ఈ ఏడాది దాస్ కా ధమ్కీ మూవీతో ప్రేక్షకుల ముందుకి వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇప్పుడు రెండు సినిమాలని యంగ్ హీరో లైన్ లో పెట్టాడు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో గోదావరి బ్యాక్ డ్రాప్ లో ఒక యాక్షన్ మూవీ చేస్తున్నాడు. యంగ్ హీరో విశ్వక్ సేన్ ఈ ఏడాది దాస్ కా ధమ్కీ మూవీతో ప్రేక్షకుల ముందుకి వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇప్పుడు రెండు సినిమాలని యంగ్ హీరో లైన్ లో పెట్టాడు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో గోదావరి బ్యాక్ డ్రాప్ లో ఒక యాక్షన్ మూవీ చేస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ జరుగుతోంది. ఇప్పటికే సగానికి పైగా మూవీ షూటింగ్ కంప్లీట్ అయ్యింది. మరో వైపు రవితేజ ముళ్ళపూడి దర్శకత్వంలో ఒక సినిమాని స్టార్ట్ చేశారు. వివిఎస్10 వర్కింగ్ టైటిల్ తో ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే స్టార్ట్ చేశారు. ఫస్ట్ షెడ్యూల్ ఇప్పటికే కంప్లీట్ అయ్యింది. ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. రామ్ తాళ్లూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తోన్నారు. అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ గా ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమాకి సంబంధించిన అప్డేట్ చిత్ర యూనిట్ నుంచి వచ్చింది. సెట్టయినట్టే ఈ మూవీ టైటిల్, ఫస్ట్ గ్లింప్స్ ని ఆగష్టు 6న రిలీజ్ చేయబోతున్నారంట. ఉదయం 11:11 గంటలకి గ్లింప్స్ ని రిలీజ్ చేయబోతున్నట్లు కన్ఫర్మ్ చేశారు. దీనికి సంబందించిన అఫీషియల్ ప్రకటన ఇచ్చారు. అలాగే ఫస్ట్ సింగిల్ కూడా వీలైంత త్వరలో రిలీజ్ చేయనున్నారంట. ఈ సినిమాకి జాక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. విశ్వక్ సేన్ సినిమాల ప్లానింగ్ ఈ మధ్య పెర్ఫెక్ట్ గా ఉంటుంది. ఎక్కువగా తన బాడీ లాంగ్వేజ్ కి సరిపోయే విధంగా ఎంటర్టైన్మెంట్ జోనర్ కథలని నమ్ముకొని మూవీస్ చేస్తున్నాడు. రవితేజ ముళ్ళపూడి దర్శకత్వంలో చేయబోయే సినిమా కూడా అలాగే ఉండబోతోంది. ప్రస్తుతం కమిట్ అయిన రెండు ప్రాజెక్ట్స్ ఫినిష్ అయిన తర్వాత దాస్ కా దమ్కీ సీక్వెల్ స్టార్ట్ చేసే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. ఈ ఏడాదిలోనే మూవీ ని రిలీజ్ చేసే ఛాన్స్ ఉంది. మరి మరి VS 10 తో విశ్వక్ ఎలాంటి సక్సెస్ అందుకుంటాడు అనేది చూడాలి. మహేష్ బాబు గుంటూరు కారంతో పాటు మీనాక్షి చౌదరి విశ్వక్ సేన్ సినిమాలో ఒకే సారి నటిస్తోంది. ఈ సినిమాలపై అమ్మడు చాలా హోప్స్ పెట్టుకుంది.

# హిడింబ.. బాక్సాఫీస్ కలెక్షన్స్ గట్టిగానే..




గత కొద్ది వారాలుగా తెలుగు చిత్రసీమ బాక్సాఫీస్ వద్ద చిన్న, మీడియం రేంజ్ సినిమాల సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే ఈ వారం దాదాపు అరడజనుకు పైగా చిత్రాలు బాక్సాఫీస్ ముందుకు వచ్చాయి. వాటిలో 'హిడింబ' ఒకటి. నటుడు అశ్విన్‌బాబు హీరోగా నటించిన కొత్త చిత్రమిది. అనిల్ కన్నెగంటి దర్శకత్వం వహించారు. నందితా శ్వేత ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించి ఆకట్టుకుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మొదటి రోజు నుంచే మంచి టాక్‌తో ముందుకెళ్తోంది. మంచి వసూళ్లను కూడా అందుకుంటోంది. ఈ సినిమా విడుదలకు ముందే.. పెయిడ్ ప్రీమియర్స్ వేశారు మేకర్స్. అప్పుడే ఇది మంచి టాక్ తెచ్చుకుంది. అయితే ఈ చిత్రం రిలీజైన రెండు రోజుల్లోనే వరల్డ్ వైడ్ గా రూ.3.36 కోట్లు గ్రాస్ అందుకుంది. ఇక శనివారం బాక్సాఫీస్ వద్ద రూ.2.33 కోట్ల గ్రాస్ వసూళ్లను కలెక్ట్ చేసింది. ఇప్పటివరకు వచ్చిన ప్రాఫిట్ ఎంతంటే? దీంతో 'హిడింబ' మొత్తం కలెక్షన్లు ప్రపంచవ్యాప్తంగా రూ.5.69 కోట్లకు చేరుకున్నాయి. చిన్న బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్ సినిమాగా వచ్చిన ఈ చిత్రం తొలి మూడు రోజుల్లోనే ఇంతటి మంచి వసూళ్లను అందుకోవడం విశేషం. ఈ విషయాన్ని మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో ఈ చిత్రం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలించింది. అయితే ఇదే సమయంలో గత వారం రిలీజైన 'బేబీ' ఇంకా సక్సెస్ ఫుల్ గా ఆడుతోంది. ఒకవేళ ఈ చిత్రం కనుక లేకపోయి ఉంటే.. 'హిడింబ' మరిన్ని వసూళ్లను అందుకునేదని విశ్లేషకులు అంటున్నారు. ఏదేమైనప్పటికీ అలా అశ్విన్ బాబు మూవీ టీమ్ లో మంచి జోష్ ను నింపుతోంది. ఇక జులై 23 ఆదివారం కాబట్టి.. మరిన్ని వసూళ్లు వస్తాయి. కాబట్టి.. వచ్చే వారం కూడా ఇదే జోరును కొనసాగిస్తే.. సినిమా మంచి లాభాల్ని అందుకున్నట్టే. మళ్ళీ 'బేబీ'నే ఇకపోతే ఈ చిత్రాన్ని అనిల్ సుంకర సమర్పణలో ఎస్వీకే సినిమాస్ పతాకంపై గంగపట్నం శ్రీధర్ నిర్మించారు. హైదరాబాద్ నగరంలో అదృశ్యమవుతున్న మహిళల కేసును చేధించే స్పెషల్ ఆఫీసర్లుగా నందిత శ్వేత, అశ్విన్ బాబు అపాయింట్ అవుతారు. క్రిమినల్.. ఆడవారినే ఎందుకు టార్గెట్ చేస్తున్నాడు, స్పెషల్ ఆఫీసర్లుగా వచ్చిన నందిత, అశ్విన్.. ఆ మహిళల కిడ్నాప్ మిస్టరీని ఎలా చేధించారనే నేపథ్యంలో థ్రిల్లర్ జోనర్ గా సినిమా రూపొందింది. అభిమానులను బాగా ఇంప్రెస్ చేస్తోంది. ఇకపోతే ఈ చిత్రంలో అశ్విన్ బాబు, నందితా శ్వేతతో పాటు శ్రీనివాస రెడ్డి, సాహితీ అవంచ, సంజయ్ స్వరూప్, శిజ్జు, విద్యులేఖ రామన్, రాజీవ్ కనకాల, శుభలేఖ సుధాకర్, ప్రమోధిని, రఘు కుంచె, రాజీవ్ పిళ్లై, దీప్తి నల్లమోతు వంటి నటులు నటించారు. వికాస్ బాడిస.. సంగీతం, బి.రాజశేఖర్.. ఛాయాగ్రహణం అందించారు.

# నితిన్ ఎక్స్ ట్రా... స్ట్రాంగ్ డేట్ సెట్ చేసుకున్నాడుగా..




యంగ్ హీరో నితిన్ ప్రస్తుతం వక్కంతం వంశీ దర్శకత్వంలో సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. నితిన్ 32 వర్కింగ్ టైటిల్ తో ఈ సినిమా తెరకెక్కుతోంది. మెజారిటీ షూటింగ్ ఇప్పటికే కంప్లీట్ అయ్యింది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోంది. మాస్ యాక్షన్ కథాంశంతో ఈ మూవీ ఉండబోతోందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ సినిమాకి సంబందించిన ఫస్ట్ లుక్ ని తాజాగా రిలీజ్ చేశారు. దీంతో పాటు టైటిల్ ని కూడా ఎనౌన్స్ చేశారు. సినిమాకి ఎక్స్ ట్రా అనే టైటిల్ ని ఖరారు చేశారు. ఆర్డనరీమెన్ ట్యాగ్ లైన్ గా పెట్టారు. అలాగే ఫుల్ గెడ్డంతో బ్లాక్ డ్రెస్ లో సీరియస్ నోట్ లో ఒక లుక్ ఉంది. దానికి ముందుగా క్లాప్ బోర్డు ముందు స్టైలిష్ గా కూర్చున్న మరో లుక్ కూడా ఉంది. పోస్టర్ బ్యాక్ డ్రాప్ లో సినిమా స్క్రిప్ట్ వెర్షన్ ఇమేజ్ ని రిప్రజెంట్ చేశారు. ఓవరాల్ గా ఈ పోస్టర్ లో మూవీ థీమ్ కూడా డైరెక్ట్ గా రివీల్ చేశారు. ఇండస్ట్రీ బ్యాక్ డ్రాప్ లోనే ఈ కథ ఉండబోతోందని ఫస్ట్ లుక్ పోస్టర్ తో కన్ఫర్మ్ అయ్యింది. ఎక్స్ ట్రా అని టైటిల్ పెట్టడం ద్వారా అతని పాత్ర తీరుని ఆవిష్కరించారు. ఫస్ట్ లుక్ పోస్టర్ పరంగా అయితే ఇంప్రెసివ్ గా ఉందని చెప్పాలి. నితిన్ కెరియర్ లో మొదటిసారిగా డిఫరెంట్ రోల్ ని ఈ మూవీ కోసం ట్రై చేస్తున్నాడు. నా పేరు సూర్య తర్వాత వక్కంతం వంశీ నుంచి రాబోతున్న సినిమా ఎక్స్ ట్రా. ఈ సినిమా నితిన్ హోమ్ బ్యానర్ శ్రేష్ఠ మూవీస్ లో తెరకెక్కుతోంది. హరీష్ జయరాజ్ చాలా కాలం తర్వాత తెలుగులో ఈ సినిమాకి సంగీతం అందిస్తున్నారు. డిసెంబర్ 23న ఎక్స్ ట్రా మూవీ రిలీజ్ చేయబోతున్నట్లు అఫీషియల్ గా కన్ఫర్మ్ చేశారుఇక అదే టైమ్ లో వెంకటేష్ సైంధవ్, నాని హాయ్ నాన్న రిలీజ్ కానున్నాయి. ఇక వక్కంతం వంశీ దర్శకుడిగా నా పేరు సూర్య మొదటి సినిమా. అది ఆశించిన స్థాయిలో సక్సెస్ ఇవ్వలేదు. అలాగే నితిన్ చివరి సినిమా మాచర్ల నియోజకవర్గం కూడా డిజాస్టర్ అయ్యింది. మరి వీరిద్దరి కాంబినేషన్ లో రాబోయే మూవీ ఏ మేరకు ప్రేక్షకులని మెప్పిస్తుందనేది చూడాలి.

# పవర్ ఫుల్ గా సూర్య "కంగువా" ఫస్ట్ లుక్!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న కంగువా చిత్రం ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకులను, అభిమానులని విశేషం గా ఆకట్టుకుంటుంది. థ్రిల్లింగ్ విజువల్స్‌తో వీడియో చాలా బాగుంది. తాజాగా మేకర్స్ సూర్య ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేశారు. హీరో పుట్టినరోజు సందర్భంగా ఫ్యాన్స్ ఆనందాన్ని పెంచడానికి, మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ పోస్టర్‌లో సూర్య గుర్రపు స్వారీ చేస్తూ, చేతిలో కత్తి పట్టుకుని యోధుడిగా కనిపిస్తున్నాడు. ఫస్ట్ గ్లింప్స్ మరియు ఇప్పుడు ఫస్ట్ లుక్ పోస్టర్ ఫ్యాన్స్ ను సంతోషపెట్టింది. దర్శకుడు సిరుత్తై శివ సూర్యని ప్రెజెంట్ చేసిన విధానం చాలా బాగుంది. కె.ఇ. యూవీ క్రియేషన్స్‌పై వంశీ, ప్రమోద్‌లతో కలిసి స్టూడియో గ్రీన్‌పై జ్ఞానవేల్ రాజా ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. దిశా పటానీ కథానాయికగా నటిస్తోంది. 2024 సమ్మర్‌లో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.









Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2/29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989